తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
28-05-2026
గురువారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 112
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice
వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

# అబద్ధాల సర్వేపై వెనక్కి తగ్గిన అధికారులు!

సిరి ఎఫెక్ట్

- 'సిరి న్యూస్' కథనానికి భారీ స్పందన
- ప్రజలు చెప్పిన నిజాలనే రాయాలంటూ అధికారుల నుంచి ఆదేశాలు
- ఉపాధ్యాయ సంఘాల సోషల్ మీడియా గ్రూపుల్లో చక్కర్లు కొట్టిన కథనం



## జనగణనలో అబద్ధాల సర్వే!

- ప్రజలు చెప్పింది వద్దు.. రికార్డుల్లో ఉన్నదే ముద్దు
- వివాదాస్పదంగా మారిన జనగణన ప్రక్రియ
- నిబంధనలు, శిక్షణ ఒకలా.. మౌఖిక ఆదేశాలు మరోలా..
- ప్రజలు ఇచ్చిన వాస్తవ సమాధానాలను పక్కకు
- అధికారుల మాట వినకుంటే ఎన్యుమరేటర్లపైనే చర్యలు
- రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్లకు వినతి పత్రాలు
- స్వేచ్ఛగా ఇస్తేనే సర్వే చేస్తామని ఉపాధ్యాయుల అల్టిమేటం

3
2

# గాంధీభవన్‌లో డిష్యూం.. డిష్యూం..

- చొక్కాలు పట్టుకుని మరీ కొట్టుకున్న కాంగ్రెస్ నేతలు
- ఫిరోజ్‌ఖాన్, ఉస్మాన్ అల్ హాజ్రీల మధ్య ఘర్షణ
- తోసేయడంతో కిందపడిన ఫిరోజ్‌ఖాన్
- మంత్రి అజారుద్దీన్ పక్కన కూర్చోవడంపై వివాదం
- అడ్డుకునేందుకు వెళ్లిన వీహెచ్‌కూ తోపులాట



2

# శ్రమజీవుల గుండెల్లో కాంగ్రెస్ మార్క్!

వచ్చే ఎన్నికలకు రేవంత్ సర్కార్‌కు భారీ మైలేజీ

- తెలంగాణ చరిత్రలోనే మొట్టమొదటిసారి కనీస వేతనాల సవరణ
- కార్మికుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న రేవంత్ రెడ్డి
- రాష్ట్రవ్యాప్తంగా కోటిమంది కార్మికులకు నేరుగా భారీ లబ్ధి
- 12 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన కాంగ్రెస్ సర్కార్
- జూన్ 1వ తేదీ నుంచే అమల్లోకి కొత్త జీతాలు
- కార్మికులను మూడు జోన్లుగా విభజించిన రేవంత్ సర్కార్
- పరిశ్రమల అవసరాల కోసం నాలుగు కేటగిరీల వర్గీకరణ
- జోన్1లో కనీస వేతనం రూ.16వేలుగా ఖరారు

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ సమాజంలో అత్యంత కీలకమైన శ్రమజీవుల గుండెల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తన 'మార్క్'ను బలంగా ప్రదర్శించింది. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరగని, పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన కనీస వేతనాల సవరణ ఫైలుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రాష్ట్రంలో పని చేస్తున్న సుమారు 1.11 కోట్ల మంది కార్మికుల కనీస వేతనాలను భారీగా పెంచుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఈ వేతనాల పెంపుదల కోసం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ఇచ్చిన తుది నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ సంచలన నిర్ణయంతో తెలంగాణలోని కోటి మందికి పైగా

మిగతా 2వ పేజీలో..




# ఎస్ఐఆర్ ప్రక్రియను తిప్పికొట్టాలి

- కాంగ్రెస్ శ్రేణులకు డిప్యూటీ సీఎం భట్టి పిలుపు
- బీజేపీకి అనుకూలంగా ఉంటేనే ఓటు.. లేదంటే తొలగింపు
- సమర్థులైన బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం.
- జూన్ 30 లోగా అన్ని గ్రామ, మండల కమిటీల భర్తీ పూర్తి కావాలి



2



# 'రైతు డిస్కం' దరఖాస్తును ఆమోదించొద్దు

- ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌కు హరీష్‌రావు లేఖ

**హైదరాబాద్, మే 27 సిరి న్యూస్:**

డిస్ట్రిబ్యూషన్ లైసెన్స్ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న దరఖాస్తుపై పలు అభ్యంతరాలు తెలుపుతూ దానిని తిరస్కరించాలంటూ బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(ఈఆర్‌సీ)కు లేఖ రాశారు. తెలంగాణ సమాజంలో రైతులను, విద్యుత్‌ను విడదీసి చూడలేం.. నాటి ఉమ్మడి పాలకులు అమలు చేసిన విద్యుత్తు సంస్కరణలే బషీర్‌బాగ్ కాల్పులకు దారితీశాయన్న విషయం విదితమేనన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం విద్యుత్తు రంగానికి

మిగతా 2వ పేజీలో..

# విద్యుత్ కనెక్షన్ల ఆక్యూపెన్సీ నిబంధనల్లో మార్పు!



- త్వరలోనే 75 కొత్త సబ్‌స్టేషన్లు అందుబాటులోకి
- విద్యుత్ కనెక్షన్ల సమస్యకు మధ్యేమార్గంగా సరికొత్త నిబంధనలు
- జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ ప్లాన్ ప్రకారం గృహ కనెక్షన్లు
- అనుమతి లేని నిర్మాణాలకు 'కేటగిరీ-8' కింద విద్యుత్ సరఫరా
- వేసవి డిమాండ్‌ను తట్టుకునేలా 75 కొత్త సబ్‌స్టేషన్లు

3



# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

- రైతాంగం ఆందోళన చెందొద్దు
- చివరి గింజ కొనుగోలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రూ.10,097 కోట్ల చెల్లింపులు
- రాజకీయ లబ్ధికే ప్రతిపక్షాల రాద్ధాంతం
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, మే 27 సిరి న్యూస్ :**

తడిసిన ధాన్యాన్ని తప్పకుండా కొనుగోలు చేస్తామని, ,రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన తడిసిన ధాన్యాన్ని సత్వరమే బాయిల్డ్

మిగతా 2వ పేజీలో..



# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

- జీహెచ్‌ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు
- కేటీఆర్ సవాల్‌పై మరోమారు ఘాటు విమర్శలు
- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి

3

# పోలీస్ కస్టడీలో బండి భగీరథ్

- ముగిసిన తొలి రోజు విచారణ
- సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం అరణ్య ఫామ్‌హౌస్‌కు తరలింపు
- కూకట్‌పల్లి డీసీపీ ఆధ్వర్యంలో విచారణ
- మరో రెండు రోజులు కొనసాగనున్న విచారణ



3

# అకాల వర్షం.. అతలాకుతలం!

- పలుచోట్ల విరిగిన కరెంట్ స్తంభాలు...
- 365 ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- 282ఫీడర్లలో గంటలోపే విద్యుత్ పునరుద్ధరణ
- 69 ఫీడర్లలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు రెండు నుంచి ఐదు గంటల సమయం
- టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ లో విద్యుత్ పునరుద్ధరణకు శ్రమించిన కార్మికులు

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణాలోని పలు జిల్లాలో మంగళవారం ఆకస్మికంగా కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది.గ్రేటర్ హైదరాబాద్ తో పాటు మెదక్. మేడ్చల్ మల్కాజిగిరి,రంగారెడ్డి ,సంగారెడ్డి ,సిద్దిపేట, కరీంనగర్ తో పాటు పలు జిల్లాలో భారీగా నష్టం వాటిల్లింది . ఆయా జిల్లాల పరిధిలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

మిగతా 2వ పేజీలో..



# కొనసాగుతున్న సరస్వతీ అంత్య పుష్కరాలు

- వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులు



2

# శ్రమజీవుల గుండెల్లో కాంగ్రెస్ మార్క్!

మొదటిపేజీ తరువాయి

కార్మిక కుటుంబాల్లో కొత్త వెలుగులు నిండబోతున్నాయి.

**కార్మికుల గుండెల్లో 'చిరస్థాయి'గా రేవంత్ రెడ్డి..**

తెలంగాణ రాజకీయ ప్రస్థానంలో ఇప్పటివరకు ఎందరో నాయకులు, ముఖ్యమంత్రులు అధికార పీఠాన్ని అధిరోహించినప్పటికీ.. సమాజంలో అణగారిన, శ్రమను నమ్ముకున్న కార్మిక వర్గం గురించి ఈ స్థాయిలో గుండె నిండుగా ఆలోచించిన దాఖలాలు ఎక్కడా లేవు. పదేళ్ల పాటు పాలించిన గత పాలకులు కనీస వేతనాల సవరణ ఫైలును పట్టించుకోకపోతే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం కేవలం రెండున్నరేళ్ల స్వల్ప కాలంలోనే కోటి మందికి పైగా శ్రమజీవుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపారు. ఒకే ఒక్క సంతకంతో రూ.16 వేల నుంచొ రూ.18,500 వరకు కనీస వేతనాలను భారీగా పెంచి, జూన్ 1 నుంచే అమలుకు ఆదేశించడం రేవంత్ రెడ్డి సాహసోపేతమైన, మానవీయ కోణానికి నిదర్శనం. తరాల తరబడి పెరిగిన ధరలతో అల్లాడిపోతున్న కార్మిక లోకానికి ఇంతటి చారిత్రాత్మక కొండంత అండను అందించిన ముఖ్యమంత్రిగా, శ్రమజీవుల గుండెల్లో రేవంత్ రెడ్డి పేరు భవిష్యత్తులోనూ ఒక అజేయమైన నాయకుడిగా చిరస్థాయిగా నిలిచిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

కొండంత అండగా రేవంత్ సర్కార్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం ఇంత పెద్ద ఎత్తున కనీస వేతనాల పెంపు నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా జీతాలు పెరగక, పెరిగిన ధరలతో సతమతమవుతున్న శ్రమజీవులకు రేవంత్ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయం కొండంత అండగా నిలిచింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో రాష్ట్రంలోని అన్ని కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఒకేసారి 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరగనుండటంతో రాజకీయంగా కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఊహించని స్థాయిలో భారీ మైలేజీ లభించినట్లయింది. శ్రమకు తగ్గ ప్రతిఫలం అందించి కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక పక్షపాతిగా నిలిచిందని క్షేత్రస్థాయిలో చర్చ జరుగుతోంది.

**జూన్ 1 నుంచే అమలు..**

కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి సెక్రటేరియట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వేతనాల పెంపు నిర్ణయాలను, వాటి విధివిధానాలను క్షుణ్ణంగా వివరించారు. ఈ పెంచిన కనీస వేతనాలు రాబోయే జూన్ 1వ తేదీ నుంచే రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వస్తాయని సీఎం స్పష్టం చేశారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటుందని, అందులో భాగమే ఈ నిర్ణయమని ముఖ్యమంత్రి తెలిపారు.

**3 జోన్లు, 4 కేటగిరీలు ఇవే!**

రాష్ట్రంలోని పరిశ్రమలు, పని ప్రదేశాల ఆధారంగా ప్రభుత్వాన్ని కార్మికులను మూడు జోన్లుగా విభజించింది. అలాగే వారి పనితనం, నైపుణ్యం ఆధారంగా అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హై స్కిల్డ్ అంటూ నాలుగు కేటగిరీలుగా వర్గీకరించి వేతనాలను ఖరారు చేసింది. కార్పొరేషన్ల (మహానగర పాలక సంస్థల) పరిధిలోకి వచ్చే కార్మికులను జోన్ 1 (గ్రేడ్ 1)గా, మున్సిపాలిటీల పరిధిలో పనిచేసే కార్మికులను జోన్ 2 (గ్రేడ్ 2)గా మరియు గ్రామీణ ప్రాంతాల్లో ఉండే కార్మికులను జోన్ 3 (గ్రేడ్ 3)గా వర్గీకరించింది.

**భారీగా పెరిగిన జీతాలు..**
**ఏ కేటగిరీకి ఎంతంటే?**

ఈ నూతన నిబంధనల ప్రకారం అత్యధిక డిమాండ్ ఉన్న జోన్1 పరిధిలో వేతనాలు భారీగా పెరిగాయి. నైపుణ్యం లేని అన్‌స్కిల్డ్ కార్మికులకు ప్రస్తుతం ఉన్న కనీస వేతనం రూ.12,750 కాగా, దీన్ని ఏకంగా రూ.16వేలకు పెంచారు. అలాగే సెమీ స్కిల్డ్ కార్మికులకు ప్రస్తుతం అందుతున్న రూ.13,592 జీతాన్ని రూ.17వేలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించింది. ఇక అత్యంత కీలకమైన స్కిల్డ్ (నైపుణ్యం కలిగిన) కార్మికులకు ప్రస్తుతం రూ.13,772 గా ఉన్న జీతాన్ని ఏకంగా రూ.18,500లకు పెంచడం గమనార్హం.

**పదేళ్ల బీఆర్ఎస్ వైఫల్యం..**

ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ సర్కార్ ఇక్కడి కార్మికులను పూర్తిగా పట్టించుకోలేదని, కనీస వేతనాల సవరణ ఊసెత్తకుండా వారిని దగా చేసిందని ధ్వజమెత్తారు. గత పాలకులు చేయని, చేయలేకపోయిన పనిని మా కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్ల అధికార కాలంలోనే చేసి చూపించిందని రేవంత్ రెడ్డి సగర్వంగా ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికుల కనీస వేతనాలపై ప్రత్యేకంగా సబ్‌కమిటీని వేసి, నివేదిక రాగానే ఏమాత్రం ఆలస్యం చేయకుండా అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామని చెప్పారు.

## 'ఎస్ఐఆర్' ప్రక్రియను తిప్పికొట్టాలి

**ఖమ్మం, మే 27 సిరి న్యూస్:**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా వారికి అనుకూలంగా ఉన్న వోటర్లను మాత్రమే జాబితాలో ఉంచి, అనుకూలంగా లేని వారిని వోటర్ లిస్ట్ నుంచి తొలగించటానికి 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పేరిట కుట్రపూరిత ప్రక్రియను చేపట్టిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తీవ్రంగా ఆరోపించారు. బుధవారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగిన జిల్లా పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

సర్ ప్రక్రియను తిప్పికొట్టటానికి కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయిలో సమర్థులైన బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలన్నారు. ఈ బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. జూన్ 30 వరకు మండల కార్యవర్గ కమిటీలు, బూత్ కమిటీలు, గ్రామ కమిటీలు,అనుబంధ సంఘ కమిటీలు పూర్తి చేయాలని చెప్పారు . పార్టీ అభివృద్ధికి అందరినీ కలుపుకొని పని చేయాలని, సామాజిక న్యాయం పాటించాలని, పార్టీ పరంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను అధికారుల ద్వారా పరిష్కరించి పార్టీ అండగా ఉంటుందనే భరోసా కల్పించాలన్నారు. ప్రతి నెల జిల్లా పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలన్నారు. నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు పదవులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడ నాగండ్ల దీపక్ చౌదరి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు,మధిర మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత, వైరా మున్సిపల్ చైర్మన్ కాపా చంద్రకళ, కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, వేజండ్ల సాయి కుమార్, సయ్యద్ గౌస్, డాక్టర్ కాపా మురళి కృష్ణ,పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య, మొక్క శేఖర్ గౌడ్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ లు పాల్గొన్నారు.

## అబద్ధాల సర్వేపై
# వెనక్కి తగ్గిన అధికారులు!

- అధికారుల ఒత్తిడి తగ్గిపోవడంతో ఊపిరి పీల్చుకున్న ఎన్యుమరేటర్లు
- వివాదాస్పద మౌఖిక ఆదేశాలకు బ్రేక్ వేసిన 'సిరి న్యూస్'కు కృతజ్ఞతల వెల్లువ
- ఇక పారదర్శకంగా సాగనున్న జనగణన సర్వే




**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ రాష్ట్రంలో కలకలం రేపిన జనగణన అబద్ధాల సర్వే వ్యవహారంపై ప్రభుత్వ యంత్రాంగం ఎట్టకేలకు దిగివచ్చింది. క్షేత్రస్థాయిలో ప్రజలు చెప్పిన నిజాలను కాకుండా, రికార్డుల్లో ఉన్న అవాస్తవాలను నమోదు చేయాలంటూ ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చిన అధికారులు ఒక్కసారిగా వెనక్కి తగ్గారు. ఈ దారుణమైన మౌఖిక ఆదేశాల గందరగోళంపై బుధవారం 'ప్రజలు చెప్పింది వద్దు.. రికార్డుల్లో ఉన్నదే ముద్దు' అనే శీర్షికన 'సిరి న్యూస్' ప్రచురితం చేసిన సంచలన కథనానికి ప్రభుత్వం నుండి ఊహించని స్థాయిలో రెస్పాన్స్ వచ్చింది. ఈ వార్త రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించడంతో, ఉపాధ్యాయులను వేధించిన అధికారులు బుధవారం ఉదయం నుండే పూర్తిగా మౌనముద్రలోకి వెళ్లిపోయారు. ఈ వివాదాస్పద విధానంపై 'సిరి న్యూస్' రాసిన ప్రత్యేక కథనం బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఉపాధ్యాయ సంఘాల సోషల్ మీడియా గ్రూపుల్లో దావానలంలా చక్కర్లు కొట్టింది. నిమిషాల వ్యవధిలోనే ఈ వార్త అన్ని జిల్లాల ఉపాధ్యాయులకు చేరడమే కాకుండా, విద్యాశాఖ, ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి సైతం వెళ్లింది. క్షేత్రస్థాయి వాస్తవాలు, ఎన్యుమరేటర్ల ఆవేదన ఈ వార్త ద్వారా బహిర్గతం కావడంతో.. అప్పటివరకు అబద్ధాలు రాయాలంటూ హుకుం జారీ చేసిన అధికారులు ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా కూడా తప్పుడు వివరాలు నమోదు చేయాలని ఉపాధ్యాయులపై అధికారులు ఎలాంటి ఒత్తిడి చేయడం లేదని క్షేత్రస్థాయి ఎన్యుమరేటర్లు ధృవీకరించారు. 'సిరి న్యూస్' కథనం తెచ్చిన ఈ మార్పుతో తెలంగాణలో నిలిచిపోయిన జనగణన సర్వే ప్రక్రియ ఇకపై ఎలాంటి అడ్డంకులు లేకుండా సజావుగా సాగనున్నదనే బలమైన నమ్మకం కుదిరింది. అధికారులు తమ మొండి వైఖరిని వీడటంతో, నిబంధనల ప్రకారం ప్రజలు చెప్పిన నిజాలనే రిపోర్టులో నమోదు చేయడానికి ఉపాధ్యాయులు సిద్ధమవుతున్నారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తప్పుడు మౌఖిక ఆదేశాలకు అడ్డుకట్ట వేసేలా సంచలన కథనాన్ని అందించి, తమకు కొండంత అండగా నిలిచిన 'సిరి న్యూస్' పత్రికకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఎన్యుమరేటర్లు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## రైతు డిస్కం దరఖాస్తును ఆమోదించొద్దు

మొదటిపేజీ తరువాయి

అత్యంత ప్రాధాన్యత ఇచ్చి భారీగా నిధులు కేటాయించి ఆ రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా 2018 జనవరి 1 నుంచి దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రైతాంగానికి నిరంతర, నాణ్యమైన ఉచిత విద్యుత్తును కేసీఆర్ అందించారన్నారు. ఫలితంగా వరి ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనాలోచిత నిర్ణయాలతో విద్యుత్తు రంగాన్ని సంక్షోభంలోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. రైతు డిస్కం పేరిట మూడో డిస్కం ఏర్పాటు చేస్తామని ప్రకటించి రైతులు సహా అన్ని వర్గాల ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తోందన్నారు. ఆచరణ సాధ్యం కాని విధానాలతో విద్యుత్తు రంగాన్ని ప్రైవేటీకరణ దిశగా నడిపించే కుట్ర జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రభుత్వం తీసుకొస్తున్న ఈ ప్రతిపాదనలోని పలు లోపాలను ఆ లేఖ ద్వారా కమిషన్ దృష్టికి తీసుకె=చ్చారు. బహిరంగ విచారణ పూర్తి కాకముందే జూన్ 2 నుంచి రైతు డిస్కం ప్రారంభమవుతుందని ప్రభుత్వం ప్రకటించడం విచారణ పూర్తికాకుండానే తీర్పు చెప్పినట్లుగా కనిపిస్తోందని ఆరోపించారు. రైతు డిస్కం కావాలి అని రైతులు అడగలేదు.. రైతు సంఘాలు అడగలేదు.. ప్రజాప్రతినిధులు అడగలేదు.. కేబినెట్ సబ్ కమిటీ నివేదిక లేదు.. విద్యుత్ సంస్థల నుండి ప్రతిపాదన లేదు.. మరి ఆర్థికపరమైన అంశాలు జి.ఓ.44లో పేర్కొంటూ మూడో డిస్కం ఏర్పాటు చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. జీవో 44 పేరా 2లో యావరేజ్ బిల్లింగ్ రేటు, యావరేజ్ కాస్ట్ ఆఫ్ సర్వీస్‌లో వ్యత్యాసం ఉందని, దీని వల్ల డిస్కంలు ఆర్థికంగా కుంగిపోతున్నాయని చెప్పారు.. అంటే థర్డ్ డిస్కం ఏర్పాటు ఆర్థికపరమైన విషయాల గురించి ఆలోచించి చేస్తున్నారు తప్ప రైతుల సంక్షేమం గురించి కాదని అర్థం అవుతోందని అన్నారు. ఈ కీలక నిర్ణయంపై అసెంబ్లీలో చర్చించకపోవడం దీనికి మరింత బలం చేకూరుస్తున్నదన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం, విస్తృత చర్చ నిర్వహించడం కమిషన్ బాధ్యతగా తాము భావిస్తున్నామని హరీష్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల వినియోగదారులపై ప్రభావం చూపే ఈ నిర్ణయంపై బహిరంగ విచారణను కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయడం సమంజసం కాదన్నారు. అన్ని జిల్లాల్లో రైతులు, ఉద్యోగులు, వినియోగదారులతో బహిరంగ విచారణలు నిర్వహించాలని కమిషన్‌ను కోరుతున్నామన్నారు.

# అకాల వర్షం.. అతలాకుతలం!

మొదటిపేజీ తరువాయి





గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 11 కేవీకి చెందిన 263 ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రధానంగా గ్రేటర్ పరిధిలోని పది సర్కిళ్ల పరిధిలో విద్యుత్ అంతరాయం జరిగింది. విద్యుత్ అధికారులు యుద్ధ ప్రతిపాదికన పునరుద్దరణ పనులు చేపట్టారు. 214 ఫీడర్లలో గంట లోపే విద్యుత్ పునరుద్దరించగా, మరో 49 ఫీడర్లలో విద్యుత్ పునరుద్దరణకు రెండు నుంచి ఐదు గంటల సమయం పట్టింది. గ్రేటర్ పరిధిలో 39 డీటీఆర్‌లు పెయిలయ్యాయి. 20 నుంచి 25 విద్యుత్ స్థంభాలు విరిగిపడ్డాయి. ఇనుప విద్యుత్ స్తంభాలు సైతం వంగిపోయాయి. ఒక వైపు, మరోవైపు బలమైన ఈదురు గాలిలో కూడా విద్యుత్ సిబ్బంది రాత్రి 11 గంటల నుంచి తెల్లవారు జామున నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాను పూర్తిగా పునరుద్దరించారు. మంగళవారం రాత్రి భారీ వర్షంతో పాటు బలంగా వీచిన ఈదురు గాలులతో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ స్థంభాలపై , విద్యుత్ తీగలపై పడడంతో డిస్క్‌లు , ఇన్సూలేటర్లు పగిలిపోయాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మేడ్చల్ జిల్లాలో 11 కేవీకి చెందిన 53 ఫీడర్లలో సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలో 11 కేవీకి చెందిన 57 ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలో 11 కేవీకి చెందిన 17 ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కాగా, సెంట్రల్ సర్కిల్ పరిధిలో 51కి పైగా ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సికింద్రాబాద్ సర్కిల్‌లో 20 ఫీడర్లలో, హైదరాబాద్ సర్కిల్‌లో 65 ఫీడర్లలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి రాత్రి 11 గంటల నుంచే విద్యుత్ పునరుద్ధరణ పనులను చేపట్టారు. తక్కువ తీవ్రత ఉన్న ప్రాంతాలలో రెండు నుంచి మూడు గంటల్లో విద్యుత్ సరఫరాను పునరుద్దరించగా, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బ తిన్న ప్రాంతాలలో, విద్యుత్ తీగలు తెగి పడిన ప్రాంతాలలో విద్యుత్ సరఫరా పనులు కొంత ఆలస్యం అయ్యాయి. తెల్లవారు జామున నాలుగు గంటల వరకు అన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను పునరుద్దరించినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పడిన విద్యుత్ అంతరాయం తొలగించడానికి 12 గంటలు పట్టింది. రాత్రంతా విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ పునరుద్దరకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. అలాగే 6 జిల్లాలలోని ప్రధాన పట్టణాల్లో రాత్రంతా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది .టీజీఎస్పీడీసీఎల్ పరిదిలోని కరీంనగర్, మెట్పల్లి తో పలు ప్రాంతాల్లోనూ వర్ష బీభస్తానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది.అధికారులు అంతరాయాన్ని తొలిగించేందుకు 10 గంటల సమయం పట్టింది .ఎండల తీవ్రత పెరగడంతో వేడి, ఉక్కపోత పెరిగింది. దోమల బెడద కూడా ఉండడం, అకాల వర్షంతో ఏర్పడిన విద్యుత్ అంతరాయంతో జనాలు రాత్రి పూట జాగరణ చేయాల్సి వచ్చింది. పిల్లలు ఉక్కపోతకు కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అకాల వర్షాల నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎండీ జితేష్ వి పాటిల్ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ లు కర్నాటి వరుణ్ రెడ్డిలు అధికారులను ఆదేశించారు.

## కొనసాగుతున్న సరస్వతీ అంత్య పుష్కరాలు

**కాళేశ్వరం, మే 27 సిరి న్యూస్:**

కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలకు భక్తులు పోటెత్తుతున్నారు. పుష్కరఘాట్‌ల వద్ద తెల్లవారు జాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. వేద మంత్రోచ్చారణలు, హారతులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కాళేశ్వర క్షేత్రం మార్మోగుతోంది. ఈ నెల 21న ప్రారంభమైన పుష్కరాల్లో భక్తులు రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాక మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ నుంచి అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి పుష్కరఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందించి పుష్కరాల ప్రాముఖ్యతను వివరించారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు పుష్కర స్నానమాచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో సకల ఐశ్వర్య ప్రాసస్థ్యం దుర్గ సూక్త హోమం అత్యంత వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన బాహుబలి సెట్టింగ్‌ను చూసి మురిసిపోయిన భక్తులు సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు. సరస్వతి పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సరస్వతి మాత, శివుని విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. అలాగే పిల్లలు ఆడుకోవడానికి ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎగ్జిబిషన్ చూపరులను మంత్రముగ్ధులను చేస్తోంది. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో మంగళ, గురువారాల్లో కాల సర్ప దోష పూజలు నిర్వహించడం ఆనవాయితీ. పుష్కరాల నేపథ్యంలో ఆ పూజలను తాత్కాలికంగా నిలిపివేశారు.

# గాంధీభవన్‌లో డిష్యూం.. డిష్యూం..

**హైదరాబాద్, మే 27 సిరి న్యూస్:**



హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం గాంధీభవన్ బుధవారం ఉద్రిక్త పరిస్థితులకు వేదికైంది. మంత్రి మహ్మద్ అజారుద్దీన్ పక్కన కూర్చోవడంపై కాంగ్రెస్ నేతలు ఫిరోజ్‌ఖాన్, కార్వాన్ ఇన్‌చార్జ్ ఉస్మాన్ అల్ హాజ్రీల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది.

మొదట మాటల యుద్ధంగా ప్రారంభమైన వివాదం క్రమంగా ఉద్రిక్తంగా మారింది. ఒకరి చొక్కాలు ఒకరు పట్టుకుని తోపులాటకు దిగారు. ఈ క్రమంలో ఉస్మాన్ అల్ హాజ్రీ ఆగ్రహంతో ఫిరోజ్‌ఖాన్‌ను గట్టిగా తోసేయడంతో ఆయన కిందపడిపోయారు. సీనియర్ నేతల సమక్షంలోనే ఈ ఘటన జరగడంతో అక్కడ ఉన్న కాంగ్రెస్ శ్రేణులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాయి. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతుండటంతో సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు వెంటనే జోక్యం చేసుకుని ఇరువర్గాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు.అయితే ఆవేశంలో ఉన్న నేతలు వీహెచ్‌ను కూడా పక్కకు తోసే ప్రయత్నం చేయడంతో పరిస్థితి మరింత వేడెక్కింది. వెంటనే ఇతర కాంగ్రెస్ నాయకులు, భద్రతా సిబ్బంది మధ్యలోకి దిగి ఇరువర్గాలను విడదీశారు. దీంతో గాంధీభవన్‌లో ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణిగాయి.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

మొదటిపేజీ తరువాయి

రైస్ మిల్లులకు తరలిస్తున్నామన్నారు. అకాల వర్షాలకు తడిసిన 9,214 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించినట్లు ఆయన వెల్లడించారు. అకాల వర్షాలు సంభవించడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉత్పన్నమైన పరిణామాలను సమీక్షించేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అత్యవసరంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రివర్గ సహచరులు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, కలెక్టర్లు, పోలీస్ అధికారులు, రవాణా శాఖాధికారులు, పౌర సరఫరాల శాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రైతాంగానికి నష్టం వాటిల్లే ఏ చర్యలనూ ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదన్నారు. ఇది రైతు పక్షపాత ప్రభుత్వం అని, చివరి గింజ వరకు కొనుగోలుకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో అదీ రబీ సీజన్‌లో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ఉపక్రమించిందని ఆయన తెలిపారు. ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 66.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం చేరగా అందులో 57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.10,097 కోట్లను చెల్లించినట్లు వెల్లడించారు. దీనివల్ల 8.15 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరిందన్నారు. కొనుగోలులో రాష్ట్రం సరికొత్త రికార్డు సృష్టించిందన్నారు. కొనుగోలు చేసిన 57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 44.67 లక్షల మెట్రిక్ టన్నులు సాధారణ రకాల ధాన్యం కాగా 12.33 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలని మంత్రి ఉత్తమ్ వివరించారు. ఇసుక సరఫరా చేసే లారీలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మళ్లించి సత్వరమే ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేస్తున్నట్లు తెలిపారు. ముందెన్నడూ లేని రీతిలో 8575 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తుంటే రాజకీయాల కోసం ప్రతిపక్షాలు రాద్ధాంతం చేసి రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ రైతాంగానికి ఎక్కడా ఆటంకాలు ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ స్పష్టం చేశారు.

**హెల్ప్ లైన్ నెంబరు 1967**

తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. రైతులకు అండగా ప్రభుత్వం ఉంటుందంటూ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసింది. రైతులకు ఎలాంటి నష్టం లేకుండా పంట మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపింది. అన్ని కొనుగోలు కేంద్రాల్లో పంట కొనుగోలు సాఫీగా సాగుతోందంటూ రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేసింది. ఈమేరకు హెల్ప్ లైన్ నెంబరు 1967 కేటాయించి ఏదైనా సమస్య ఉంటే సంప్రదించాలని సూచించింది.

# విద్యుత్ కనెక్షన్ల 'ఆక్యూపెన్సీ' నిబంధనల్లో మార్పు!

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ రాష్ట్రంలో వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడమే తమ ప్రధాన లక్ష్యమని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్ స్పష్టం చేశారు. బుధవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన 'మీడియా ఇంటరాక్షన్' ప్రోగ్రాంలో ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తు విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు వీలుగా త్వరలోనే రాష్ట్రంలో 75 కొత్త సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్డింగ్ ఆక్యూపెన్సీ సర్టిఫికేట్ విద్యుత్ కనెక్షన్ల సమస్యకు వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా మధ్యేమార్గంగా నిబంధనలను సవరించినట్లు వెల్లడించారు.

**ఆక్యూపెన్సీ నిబంధనల సవరణ..**

హైదరాబాద్ మహానగర పరిధిలో ఆక్యూపెన్సీ సర్టిఫికేట్ సమస్య కారణంగా నిలిచిపోయిన విద్యుత్ కనెక్షన్ల విషయంలో సంస్థ సానుకూల నిర్ణయం తీసుకుంది. జీహెచ్‌ఎంసీ లేదా హెచ్‌ఎండీఏ నిబంధనల ప్రకారం ప్లాన్ అనుమతులతో ఇళ్లు నిర్మించిన వారికి యథావిధిగా గృహ కనెక్షన్లు ఇస్తామని సీఎండీ తెలిపారు. 10 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలకు మాత్రమే ఆక్యూపెన్సీ సర్టిఫికేట్ అవసరమని, స్వల్ప డివియేషన్లను (నిర్మాణ మార్పులను) తాము పట్టించుకోబోమని స్పష్టం చేశారు. భవనం ముందు భాగంలో కాకుండా ఇరుపక్కల లేదా వెనుక వైపు డివియేషన్లు ఉంటే.. యజమానులు జీహెచ్‌ఎంసీ అధికారులను కలిసి ఫీజు చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవచ్చని సూచించారు. అయితే, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలకు సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కేవలం 'కేటగిరీ 8' కింద మాత్రమే విద్యుత్ కనెక్షన్లు ఇస్తామని స్పష్టం చేశారు.

**స్టోర్స్ మెటీరియల్‌పై కఠిన నిఘా..**

డిపార్ట్‌మెంట్ పనుల కోసం విద్యుత్ స్టోర్స్ నుంచి విడుదలవుతున్న మెటీరియల్ పక్కదారి పడుతుందనే సమాచారంతో సీఎండీ కఠిన నిబంధనలు తీసుకువచ్చారు. ఇకపై సెక్షన్ల వారీగా చేపట్టే ప్రతి పనికి 'ఎస్టిమేషన్' పూర్తి స్థాయిలో తయారైన తర్వాతనే స్టోర్స్ నుండి మెటీరియల్ విడుదలవుతుందని స్పష్టం చేశారు. స్టోర్స్ నుంచి 80 శాతం మెటీరియల్ డ్రా చేసి కూడా సకాలంలో పనులు పూర్తి చేయకపోతే సదరు అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మార్కెట్‌లో మీటర్ల కొరత ఉందనే ప్రచారాన్ని ఆయన ఖండించారు. కాలిపోయిన, ఆగిపోయిన మీటర్ల స్థానంలో వేయడానికి కొత్త మీటర్లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని, ఎవరైనా మీటర్లు లేవని చెబితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

**రెప్పపాటు కరెంట్ పోనివ్వం..**

ఎండాకాలం మరియు వర్షాకాలం విద్యుత్ డిమాండ్‌ను, ఈదురు గాలులను తట్టుకునేలా విద్యుత్ లైన్లను తీర్చిదిద్దుతున్నట్లు జితేష్ వి పాటిల్ తెలిపారు. కొత్తగా నిర్మించిన 33 కేవీ సబ్‌స్టేషన్ల పనులు పూర్తయ్యాయని, వచ్చే నెలలోనే 75 సబ్‌స్టేషన్లను చార్జ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. జూన్ నెలలో 132 కేవీ, 33 కేవీ, ఎల్‌టీ లైన్ల బలోపేతానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు ఇప్పటికే పూర్తయిందని చెప్పారు. అధిక లోడు ఉన్న ఫీడర్లు, డీటీఆర్‌లను గుర్తించి అదనపు సామర్థ్యం గల పీటీఆర్‌లను ఏర్పాటు చేస్తున్నామని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని భరోసా ఇచ్చారు. అండర్‌గ్రౌండ్ కేబుళ్ల కొరత తీర్చేందుకు టెండర్లు ఆహ్వానించామన్నారు.

**టర్న్‌కీ విధానంలో మార్పులు!**

టర్న్‌కీ విధానాన్ని ఎత్తివేసిన తర్వాత వినియోగదారులకు సేవలలో కొంత ఆలస్యం జరుగుతున్న మాట వాస్తవమేనని అంగీకరించిన సీఎండీ, దాన్ని అధిగమించడానికి కాంట్రాక్టర్ల పనుల కేటాయింపులో కొత్త మార్పులు చేశారు. వెండర్ కాంట్రాక్టర్లతో పాటు టర్న్‌కీ పద్ధతిలో పనిచేసే కాంట్రాక్టర్లందరికీ సమానంగా పనులు కల్పిస్తామన్నారు. అయితే, ఏ ఒక్క కాంట్రాక్టర్‌కు ఒకేసారి మూడు కంటే ఎక్కువ పనులు అప్పగించబోమని, ఆ మూడు పనులు పూర్తి చేసిన తర్వాతే కొత్త పనులు ఇస్తామన్నారు. గతంలో టర్న్‌కీ ఒప్పందాలు చేసుకున్న వారు కొత్త నిబంధనల ప్రకారం కిలోవాట్‌కు రూ.10 వేల చొప్పున చెల్లించి పనులు చేయించుకోవచ్చని, వీరికి జూన్ 15 వరకు సమయం ఉందని తెలిపారు. అలాగే, ప్రత్యేకంగా డెడికేటెడ్ లైన్, డీటీఆర్ కావాలనుకునే వినియోగదారులు అందుకు సంబంధించిన ప్రత్యేక నిధులు చెల్లిస్తే తక్షణమే ఏర్పాటు చేయడానికి సంస్థ సిద్ధంగా ఉందని సీఎండీ జితేష్ వి పాటిల్ వెల్లడించారు.

# పోలీస్ కస్టడీలో బండి భగీరథ్

- ముగిసిన తొలిరోజు విచారణ
- సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం అరణ్య ఫామ్‌హౌస్‌కు తరలింపు
- కూకట్‌పల్లి డీసీపీ ఆధ్వర్యంలో విచారణ
- కోర్టు అనుమతితో మూడు రోజుల పోలీస్ కస్టడీ
- మరో రెండు రోజులు కొనసాగనున్న విచారణ

**హైదరాబాద్, మే 27, సిరి న్యూస్:**

పోక్సో కేసులో నిందితుడు బండి సాయి భగీరథ్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. మల్కాజిగిరి కోర్టు మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి ఇవ్వడంతో బుధవారం ఉదయం పోలీసులు భగీరథ్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

ముందుగా వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత కేసుకు సంబంధించిన సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం మొయినాబాద్‌లోని అరణ్య ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లారు. అరణ్య ఫామ్‌హౌస్‌లో ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించిన పోలీసులు, అనంతరం భగీరథ్‌ను కూకట్‌పల్లి డీసీపీ కార్యాలయానికి తరలించారు. డీసీపీ ఆధ్వర్యంలో తొలిరోజు విచారణ నిర్వహించారు. విచారణ అనంతరం మళ్లీ పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. భగీరథ్‌ను మరో రెండు రోజులు విచారించాల్సి ఉంది. కేసులో మరిన్ని వివరాలు, ఆధారాలు సేకరించే దిశగా పోలీసులు ప్రశ్నలు సంధిస్తున్నట్లు సమాచారం.

ఈ కేసులో నిందితుడిని ఏడు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టును కోరారు. అయితే కోర్టు కేవలం మూడు రోజుల పోలీస్ కస్టడీకి మాత్రమే అనుమతి ఇచ్చింది.

# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

**హైదరాబాద్, మే 27, సిరి న్యూస్:**

రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతామని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, జూన్ చివరి నాటికి మరో లక్ష పూర్తవుతాయని, జీహెచ్‌ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో కలిసి పొంగులేటి బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. తొలి దశలో హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.. దీనికి అవసరమైన కార్యాచరణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లాం.. 13చోట్ల స్థలాలు పరిశీలించాం.. జీహెచ్‌ఎంసీలో స్థలం కొరతతో 18వేల ఇళ్లే ఇచ్చాం. పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములను కేటాయిస్తున్నాం.. జీవనోపాధికి అనుగుణంగా ఉండే ప్రాంతాల్లో, నివాసయోగ్యమైన ప్రదేశాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తాం అని మంత్రి పొంగులేటి వివరించారు. పేదల ఆలోచనలు, సూచనలకు అనుగుణంగానే యుద్ధప్రాతిపదికన ఇళ్లు నిర్మిస్తామని, ఒక్క రూపాయి ఫీజు కూడా తీసుకోకుండా మహిళల పేర రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు. బీఆరఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి పది ఇళ్లు కూడా నిర్మించలేదని, తమ ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500కుపైగా ఇళ్లు ఇచ్చిందని, రెండో విడతలో రెండువేల ఇళ్లు కేటాయిస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లపై బీఆరఎస్ నేత కేటీఆర్, మంత్రి పొంగులేటి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. పదేళ్ల బీఆరఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనన్నారు. మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే మీరు పోటీకి దూరంగా ఉంటారా అంటూ కేటీఆర్‌కు సవాల్ విసిరారు.

## నర్సింగ్ విద్య బలోపేతానికి చర్యలు

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ సమీక్ష

**హైదరాబాద్, మే 27, సిరి న్యూస్ :**

నర్సింగ్ వ్యవస్థలో వస్తున్న మార్పుల దృష్ట్యా రాష్ట్రంలో నర్సింగ్ విద్యను బలోపేతం చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. నర్సింగ్ కౌన్సిల్ బలోపేతంపై సచివాలయంలో బుధవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు ఈ సమీక్షలో జీఎనఎం విద్యార్థులకు తమ కెరీర్ డెవలప్‌మెంట్ కోసం పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ కాలేజీలలో ప్రవేశాలకు అనుమతి ఇవ్వాలని మంత్రి దామోదర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 10 బీఎస్సీ నర్సింగ్ కాలేజీలను, పీజీ(ఎంఎస్సీ) నర్సింగ్ కాలేజీని ఏర్పాటు చేయాలన్నారు. నర్సింగ్ కాలేజీలలో మిడ్ వైఫరీ కోర్సులను బలోపేతం చేసేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ పోస్టును క్రియేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. నర్సింగ్ కౌన్సిల్ కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే విద్యార్థులకు, నర్సులకు కార్యాలయ ప్రాంగణంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమీక్షలో వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యులత, వైద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ సీఈ శశిధర్, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# 12 నుంచి బడులు ప్రారంభం

- గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం
- సకాలంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ
- అద్దె భవనాలపై సమగ్ర నివేదిక అందించాలి
- సొంత భవనాల్లో ఉన్న గురుకులాల్లో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు
- గురుకుల, సంక్షేమ వసతి విద్యా సంస్థలపై సమీక్ష



**ఖమ్మం, మే 27, సిరి న్యూస్**

రాబోయే విద్యా సంవత్సరానికి గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. ఖమ్మం కలెక్టరేట్లో బుధవారం కలెక్టర్ దివా కర టిఎస్., అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తో కలిసి గు రుకుల, సంక్షేమ వసతి విద్యాసంస్థలపై ఉప ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా గురుకుల పాఠ శాలల్లో అడ్మిషన్లు పెరిగేలా అధికారులు ప్ర త్యేక దృష్టి సారించాలని సూచించారు. సీట్లు పూర్తిగా భర్తీ కాని రెసిడెన్షియల్ పాఠశాలలపై అధ్యయనం చేసి కారణాలు గుర్తించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని వసతివిద్యా సంస్థలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని తెలిపారు. వేసవిలోనే అవసరమైన మరమ్మతులు, మౌలిక వసతులను కల్పించా లని సూచించారు. ప్రతి రెసిడెన్షియల్ పాఠశా లలో డైట్ ఛార్జీలు, మెనూ వివరాలను తప్పని సరిగా ప్రదర్శించాలని తెలిపారు. ప్రతి గురు కుల విద్యాసంస్థకు ఒక జిల్లా అధికారిని ఇన్ చార్జిగా నియమించి, వారు ప్రతి నెల పాఠశాలలను సందర్శించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు రెగ్యులర్ పాఠశాలలను సందర్శించి తనిఖీ నివేదికలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించా రు. వైద్యులు కూడా ప్రతి నెల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని తెలిపారు.

**అద్దె భవనాలపై సమగ్ర నివేదిక**

అద్దె భవనాల్లో ఉన్న గురుకులాల పరిస్థితిపై సమగ్ర నివేదిక సమర్పించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. అవసరమైన మరమ్మతులు నిరంతరం చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాల పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో ఎన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయో, యంగ్ ఇండియా పాఠశాలలు పూర్తయ్యాక ఎన్ని తరలించవచ్చో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రాంతీయ సమన్వయకర్తలు వొచ్చే 12 రోజుల్లో అన్ని పాఠశాలలను చెక్స్ ప్రకారం పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పిం చాలని ఆదేశించారు. వొచ్చే విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం లు విద్యార్థులకు సకాలంలో అందించడాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, భారీగా నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, అద్దెల చెల్లింపులు ప్రభుత్వం క్రమం తప్పకుండా చెల్లిస్తున్నదని తెలిపారు. మరమ్మతుల నిధులు కూడా విడుదల చేస్తున్న నేపథ్యంలో పనులు క్షేత్రస్థాయిలో వేగంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనుల బిల్లులు అధికంగా క్లియర్ చేసినట్లు తెలిపారు. విద్యా శాఖ పనుల బిల్లుల చెల్లింపులకు డీఎంఎస్టీ నిధులను కూడా విని యోగిస్తామని చెప్పారు. విద్యా సంస్థ లకు ఉచిత విద్యుత్ అందుతున్న నేపథ్యంలో స్వంత భవనాల్లో నడుస్తున్న గురుకులాల్లో సోలార్ ప్యానెల్ల ఏర్పాటు కోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో గురుకులాల ప్రాంతీయ సమ న్వయకర్తలు, ఎస్ఈ, ఎన్పిడిసిఎల్ శ్రీనివాస్, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# వనపర్తిలో విషాదం

- అప్పుల భూతానికి ఒకే కుటుంబంలో నలుగురు బలి
- భార్య, పిల్లలను చంపి మామిడి తోట కౌలుదారు ఆత్మహత్య
- చనిపోయే ముందు కన్నీరు పెట్టించే సెల్ఫీ వీడియో, వాయిస్ రికార్డింగ్స్

**వనపర్తి, మే 27, సిరి న్యూస్:**


అప్పుల భూతం, వడ్డీ వ్యాపారుల వేధింపులు ఒక నిండు కుటుంబాన్ని బలితీసుకున్నాయి. మామిడి తోటలు కౌలుకు తీసుకున్న ఓ రైతు సరైన దిగుబడులు రాక అప్పులపాలయ్యాడు. అప్పులు తీర్చడానికి ప్రైవేటు బ్యాంకులో ఇంటిని తనఖా పెట్టాడు. రెండు నెలలుగా వాయిదాలు చెల్లించకపోవడంతో ప్రైవేటు రుణ సంస్థ నుంచి ఒత్తిడి ఎక్కువైంది. అదేవిధంగా అప్పులు ఇచ్చిన వారి వేధిం పులు పెరిగాయి. వారి వేధింపులు తట్టుకోలేక భార్య, కుమారుడు, కుమార్తెను తాళ్లతో కట్టేసి తోటలో ఉన్న నీటి సంపులో పడేశాడు. అనంతరం ఉరి వేసుకొని ఆత్మహత్యకుపాల్పడ్డాడు. వనపర్తి జిల్లా ఖిల్లా గణపురం మండలం సల్కేలాపూర్ గ్రామ శివారులో బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం డోకూర్కు చెందిన మామిడి తోట గుత్తేదారు గగ్గల్ల నరసింహ (36) వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం సల్కెలాపురంలో మామిడి తోటను నాలుగేళ్లుగా కౌలుకు తీసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇంటిపై తీసుకున్న రుణం కిస్తీలు చెల్లించాలని ఒత్తిడి చేసి, మానసికంగా నన్ను ఇబ్బందులకు గురి చేశారు. వేధింపులు తట్టుకోలేక నర్సింహ కుటుంబ సభ్యులను చంపి ఆత్మహత్య చేసుకున్నాడు. నరసింహ భార్య హేమలత (31), కుమారుడు సాయి నిహాల్ (15), సాహితిశ్రీ (13) లను చేతులు కట్టేసి మామిడి తోటలోని సంపులో వేసి ముంచడంతో మృతి చెందారు. నరసింహ ఆత్మహత్య చేసుకునే ముందు అప్పుల బాధతో వేధించిన వారి సమాచారం వివరాలు తెలుపుతూ సెల్ ఫోన్ స్టేటస్ ద్వారా బంధువులకు సమా చారం అందించారు. అతడు ఆత్మహత్య చేసుకునే సమయంలో గద్వాలలోని తన వదిన (భార్య అక్క) అల్లుడు దరిశెల్లికి ఫోన్ చేసి అప్పులు ఇచ్చినవారు వేధింపు లకు గురిచేస్తున్నారని తన కుటుంబ సభ్యులు నీటి సంపులో పడుకున్నారని ఏడుస్తూ తెలిపి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పులు చెల్లించాలని వేధిస్తున్న వారి వివరాలు సెల్ ఫోన్‌లో వాయిస్ రికార్డ్ చేసి స్టేటస్ పెట్టుకున్నాడు. రూ.60 లక్షలు అప్పు ఉంటే రూ. కోటి 20 లక్షలకు పత్రాలు రాయించుకున్నారని ఆరోపించా రు. హోమ్ లోన్ వారు ఇంటి లో ఉన్న ఆభరణాలు, వస్తువులను స్వాధీనం చేసుకొని ఇంటికి నోటీసులు అంటించి ఆవేదనకు గురి చేశారని వాపోయాడు. వడ్డీ వ్యాపారులకు రూ.3 వడ్డీ కడుతూ వచ్చానని అప్పుల భారం మోయలేక, చిత్రహింసలు భరించలేకపోతున్నానని బోరుమన్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మృతుడి కూతురు, కుమారుడిని పాఠశాలలో ఎగతాళి చేస్తున్నారని చదువు మాన్పించి తోటలో పనులు చేయించాడని తెలిపారు. మామిడి తోటకు లక్షల అప్పులు చేసి మందులు వేసి నష్టపోయినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఈ ఘటనను చూసి కన్నీరు మున్నీర య్యారు. సంఘటన స్థలాన్ని డిఎస్పి గిరిబాబు, సిఐ రాంబాబు, ఎస్సై వెంకటేష్ పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ ఘటనపై డీఎస్పీ గిరిబాబు మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు అనాలోచిత చర్యల వల్ల జీవితాలు నాశనం చేసుకుంటారని తెలిపారు. నరసింహ మామిడి తోటలను కౌలుకు తీసుకొని అప్పుల వారి ఒత్తిడితో కుటుంబ సభ్యులను నీళ్ల సంపులో ముంచిన అనంతరం ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.



# మహాలక్ష్మిల చేతికి సోలార్ పవర్ ప్లాంట్

- ఇది దేశ చరిత్రలే ప్రథమం
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి సీతక్క
- రూ.3 కోట్ల విలువైన సోలార్ ప్లాంట్ ప్రారంభించిన మంత్రులు

**ఎర్రుపాలెం/మధిర, మే 27, సిరి న్యూస్:**



మహిళల ఆర్థిక స్వావలంబన ఒక చారిత్రక అడుగని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలం వెంకటాపురం గ్రామంలో బుధవారం పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్‌ను మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారత కోసం సౌర విద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారి అన్నారు. మహిళా సంఘాల సభ్యులతో సోలార్ పవర్ ప్రాజెక్టులు నిర్మించి, వారి ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్లు, క్యాంటీన్లు, పసుపు బాయిలర్ ప్లాంట్ల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తోందన్నారు. మాదాపూర్ లాంటి ఖరీదైన ప్రాంతాల్లో మహిళా సంఘాల ఉత్పత్తుల కోసం షాపులు కేటాయించడమే కాక రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది వేల మహిళా సంఘాల భవనాలకు ఒకేరోజు ప్రజా ప్రభుత్వం భూమి పూజ నిర్వహించిందన్నారు. వెంకటాపురంలో మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో సుమారు రూ.3 కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా మహిళా సంఘాలకు రోజుకు రూ.14,000 నుంచి రూ.15,000 వరకు ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం భూమిని కేటాయించడమే కాకుండా సబ్సిడీని అందజేస్తోందన్నారు. ఉత్పత్తి అయిన విద్యుత్తును డిస్కమ్‌లు కొనుగోలు చేసేలా పీపీఏ ఒప్పందాలు కూడా జరిగాయని ఆయన ప్రకటించారు. ప్రతి జిల్లాలోనూ ఇలాంటి సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని, 2030 నాటికి రాష్ట్రంలో 20వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. గతంలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పరిమితి రూ.5 లక్షల వరకు మాత్రమే ఉండేదని, ప్రస్తుత ప్రభుత్వం ఈ పరిమితిని రూ.10 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుందని చెప్పారు.

**గ్రీన్ ఎనర్జీ దిశగా**

రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ దిశగా తీసుకెళ్లడంలో ప్రభుత్వం మహిళా సంఘాలను భాగస్వాములను చేస్తోందని భట్టి అన్నారు. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందన్నారు. 202324లో పీక్ డిమాండ్ 15,000 మెగావాట్లు ఉండగా ప్రస్తుతం 18,485 మెగావాట్లకు చేరుకుందన్నారు. ఇంత భారీ డిమాండ్ ఉన్నప్పటికీ ముందస్తు ప్రణాళికల వల్ల ఎక్కడా కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతోందని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం పనిచేస్తున్న ఈ ప్రభుత్వాన్ని మహిళలే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. బీఆరఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు.

**అభివృద్ధి పనుల ప్రారంభం**

సుమారు రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఎర్రుపాలెం మండలంలో 132/33 కేవీ సబ్‌స్టేషన్, జమలాపురంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌తోపాటు హెచ్‌పీ పెట్రోల్ బంక్, సోలార్ పవర్ ప్లాంట్, ఇండక్షన్ స్టవ్స్, పసుపు బాయిలర్ ప్లాంట్ వంటివి ఉన్నాయి. కార్యక్రమంలో స్పెషల్ సీ¾ఎస్ దాన కిషోర్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, ఖమ్మం కలెక్టర్ దివాకర్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, రెడ్కో వైస్ చైర్మన్ అండ్ ఎండీ అనిల, ఎన్పీడీసీఎల్ సీఎండి వరుణ్ రెడ్డి, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, గిడ్డంగుల కార్పొరేషన్ సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సంపాదకీయం



# కన్నీటి వాన...
# కొనుగోళ్ల గోస

రక్తాన్ని చెమటగా మార్చి పండించిన పంట చేతికొచ్చే వేళ.. ప్రకృతి కన్నెర్ర జేస్తే అన్నదాత గుండె చెరువైంది. రోహిణి కార్తె ప్రవేశంతో ఒక్కసారిగా మారిన వాతావరణం, ముంచుకొచ్చిన అకాల వర్షాలు తెలంగాణ రైతాంగాన్ని నిలువునా ముంచేశాయి. సంగారెడ్డి జిల్లాలోని ఆందోల్, జహీరాబాద్ నియోజకవర్గాల నుండి మొదలుకొని రాష్ట్రవ్యాప్తంగా వరి కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన క్వింటాళ్ల కొద్దీ ధాన్యం నీట మునిగిపోవడం అత్యంత విచారకరం. ఆకాశం వైపు చూస్తూ.. ఎండబెట్టిన వడ్లు తడిసిపోకుండా తార్పాలిన్లు కప్పుకునేందుకు తల్లడిల్లుతున్న రైతుల దృశ్యాలు పాలకుల నిర్లక్ష్యానికి, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న యంత్రాంగానికి నిలువెత్తు సాక్ష్యాలు. ఈ విపత్తుకు కేవలం ప్రకృతిని మాత్రమే నిందించి అధికారులు చేతులు దులుపుకోలేరు. పంట కోతలు పూర్తయి 40 రోజులు గడుస్తున్నా కొనుగోలు ప్రక్రియ ఆశించిన స్థాయిలో సాగకపోవడమే ఈ ఘోర పరిస్థితికి ప్రధాన కారణం. క్షేత్రస్థాయిలో లారీల కొరత తీవ్రంగా ఉంది. ఐకేపీ కేంద్రాల్లో కాంటా (తూకం) వేసిన ధాన్యాన్ని సకాలంలో రైస్ మిల్లులకు తరలించకపోవడంతో, తూకం వేసిన బస్తాలు కూడా వానకు తడిసి ముద్దయ్యాయి. ఒకవైపు అకాల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేసినా, రవాణా యంత్రాంగం ఎందుకు అప్రమత్తం కాలేదనేది సమాధానం లేని ప్రశ్న. ప్రకృతి ఒకవైపు రైతులను దెబ్బతీస్తుంటే.. నిబంధనల పేరుతో రైస్ మిల్లర్లు, ఐకేపీ కేంద్రాల నిర్వాహకులు చేస్తున్న 'తరుగు దోపిడీ' అన్నదాతల గాయాలపై కారం చల్లుతోంది. రైతులు ధాన్యాన్ని ఎంతో కష్టపడి ఆరబెట్టి తెచ్చినా, 'తేమ శాతం' నెపంతో క్వింటాలుకు 5 నుండి 8 కిలోల వరకు అక్రమంగా తరుగు తీస్తూ నిలువునా దోచుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ఒక బస్తాకు 40 కేజీలే తూకం వేయాల్సి ఉన్నా, మిల్లర్లు–నిర్వాహకులు కుమ్మక్కై ఒక్కో బస్తాకు 42 నుండి 43 కిలోల వరకు లాగుతున్నారు. ఈ నిలువు దోపిడీని అడ్డుకోవడంలో క్షేత్రస్థాయి అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రభుత్వాలు మారినా రైతుల ఇబ్బందులు మారకపోవడం శాపంగా మారింది. తేమ శాతం సాకుతో మిల్లుల వద్ద లారీలను గంటల తరబడి నిలిపివేయడం, ఇప్పుడు వర్షాల వల్ల ధాన్యం తడిసి మొలకలు వచ్చే ప్రమాదం పొంచి ఉండటంతో అన్నదాతల్లో ఆందోళన తీవ్రతరమైంది. ప్రభుత్వం ఇప్పుడు కాలయాపన, మొద్దునిద్ర వీడి తక్షణమే స్పందించాలి. విపత్తు సమయాల్లో కఠిన నిబంధనలను పక్కనబెట్టి, ఎలాంటి ఆంక్షలు లేకుండా తడిసిన ధాన్యాన్ని పూర్తి మద్దతు ధరకు (ఎంఎస్పీ) ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలి. తరుగు పేరుతో దోపిడీకి పాల్పడే మిల్లర్ల లైసెన్సులను రద్దు చేస్తామని కేవలం హెచ్చరికలకే పరిమితం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. కళ్లాల్లో కన్నీరు మున్నీరవుతున్న అన్నదాతను ఆదుకుని, వారికి తక్షణ భరోసా కల్పించడమే పాలకుల ప్రాథమిక కర్తవ్యం.

# అన్నదాత ఆక్రోశం..

- రోడ్డుపై ధాన్యం బస్తాలు తగలబెట్టి నిరసన
- ఎండకు, ఎండి వానకు తడిసిన ప్రభుత్వంలో,చలనం లేదు
- రహదారిపై ధాన్యం బస్తాలను తగలబెట్టి ధర్నా

వెల్దుర్తి, మే 27 (సిరి న్యూస్)




వెల్దుర్తి మండలంలోని లింగాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి లారీలు రాకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రహదారిపై ధాన్యం బస్తాలను తగలబెట్టి ధర్నాకు దిగారుకొనుగోలు కేంద్రంలో కాంటాలు పూర్తయి దాదాపు నెల కావస్తున్నా లారీల రాకపోవడంతో ధాన్యం ఎక్కడికక్కడే పడి ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. పంట పండించడం కంటే విక్రయించడమే కష్టంగా మారిందని వారు కన్నీటి పర్యంత మయ్యారు. ఒకపక్క వర్షాలు కురుస్తుం డటంతో ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం తడిసి ముద్ద అవుతోందని, దానిని మళ్లీ ఆరబెట్టేందుకు కూలీల ఖర్చు తడిసి మోపెడవుతోందని వాపోయారు. అటు లారీలు రాక ధాన్యం తరలకపోవడంతో కేంద్రం వద్దే రాత్రింబవళ్లు పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు. ధాన్యాన్ని కాపాడుకునేందుకు, తరలించేందుకు అదనంగా డబ్బులు ఖర్చు చేసి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని ఆవేదన చెందారు. ప్రజా ప్రభుత్వం అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న తహశీల్దార్ శ్రీనివాస్, ఎస్సై రాజు, రెవెన్యూ సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని రైతులను సముదాయించారు. వారం రోజుల్లోగా ఉన్న ధాన్యం మొత్తాన్ని తరలించేలా చర్యలు తీసుకుంటామని, వెంటనే లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని రైస్ మిల్లులకు చేరవేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. తహశీల్దార్ హామీతో రైతులు శాంతించి ఆందోళన విరమించారు. జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి లారీల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



# రైతులు అధైర్యపడొద్దు





- తడిసిన ధాన్యం కూడ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది.
- ధాన్యం తరలింపును త్వరగా పూర్తి చేయాలి.
- రైతులకు ఇబ్బందులు లేకుండా వేగంగా కొనుగోళ్లు చేపట్టాలి.
- హమాలీలను పెంచి లోడింగ్, అన్లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి.
- టోకెన్ల వారీగా కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలి.
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రిజిస్టర్లు, ట్రక్ షీట్, ఓపీఎంఎస్ నమోదులు పటిష్టంగా జరగాలి.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

మెదక్ మే,27(సిరిన్యూస్)

తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని రైతులకు కలెక్టర్ భరోసా కల్పించారు.వాతావరణ ప్రతికూల ప్రభావంతో అకాల వర్షాలు పడుతున్నాయని,రైతులు అధైర్యపడవద్దన్నారు.ప్రభుత్వ యంత్రాంగం అండగా ఉందని క్షేత్రస్థాయిలో తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం, కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి అదనపు కలెక్టర్ నగేష్ జిల్లాలోని తాసిల్దార్లు ఆర్డీవోలు, ఎంపీడీవోలు, జిల్లా పౌరసరఫరాల అధికారులతో కలిసి కలెక్టర్ గూగుల్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ ప్రతికూల ప్రభావంతో జిల్లాలో వర్షం పడడం జరిగిందని ప్రభుత్వ యంత్రాంగం క్షేత్రస్థాయిలో(04) వేల క్వింటాళ్ల తడిసిన ధాన్యం ఉన్నట్లు నివేదికలు అందించడం జరిగిందన్నారు. కుల్చారం, కౌడిపల్లి, టేక్మాల్, శంకరంపేట,(ఏ) మండలాల్లో అత్యధిక వర్షపాత నమోదయిందని ఈ మండలాల్లో ధాన్యం కేంద్రాలలో తడిచినట్లు వివరించారు.తడిసిన ధాన్యానికి కొనుగోలు చేసే విధంగా బాయిల్డ్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంటామని రైతులెవరు అధైర్యపడవద్దని కలెక్టర్ తెలిపారు.ఇప్పటివరకు 59 వేల 227 మంది రైతులు నుండి 2,76,776.600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 39,879 రైతులకు గాను. 441.15 కోట్ల రూపాయలు ఎకౌంట్లోలో జమ చేశామని,18 సెంటర్లలో ధాన్యం కొనుగోలు పూర్తిచేసుకుని ముగించడం జరిగిందని వివరించారు.వాతావరణ ప్రతికూల ప్రభావం నేపథ్యంలో రైతులకు ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను అవగాహన కల్పిస్తూ ధాన్యం వర్షానికి తడవకుండా రక్షించుకునే విధంగా టార్పోలిన్సు అందుబాటులో ఉంచాలన్నారు.కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని ఎగుమతి వేగాన్ని పెంచి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టోకెన్ జారీ నుంచి మిల్లులకు తరలింపు వరకు ప్రతి అంశాన్ని పారదర్శకంగా నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.టోకెన్ పొందిన రైతుల సంఖ్య, ప్రతి టోకెన్‌కు అనుగుణంగా ఎన్ని లారీలు, ట్రాక్టర్లు పంపించారో స్పష్టమైన రికార్డులు నిర్వహించాలని సూచించారు.ధాన్యం నిల్వలు,గన్ని సంచుల లభ్యత, కాంటా పూర్తయిన తర్వాత మిగిలి ఉన్న ధాన్యం బస్తాల వివరాలు, రిజిస్టర్ నిర్వహణ, తదితర అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు ప్రతి మిల్లుకు ఏ సమయానికి వాహనాలు బయలుదేరాయో, ఇప్పటివరకు మొత్తం ఎన్ని లారీలు వెళ్లాయో, ట్రక్ షీట్‌లో నమోదు చేసిన వివరాలు సరిపోలేలా చూడాలని తెలిపారు.ఈ గూగుల్ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు, మెదక్ రమాదేవి, తూప్రాన్ జై చంద్రారెడ్డి, నర్సాపూర్ రామకృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారులు నిత్యానంద్, జగదీష్, తాసిల్దార్లు, ఎంపీడీవోలు,తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ స్ఫూర్తిని నిలబెట్టాలి

- తెలంగాణ ఉద్యమకారులకు గౌరవ జీవనం కల్పించాలి
- తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక కన్వీనర్ మంద బాస్కర్ రెడ్డి

గుమ్మడిదల, మే 27( సిరి న్యూస్ ):




ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలువురు ఉద్యమకారులు పాల్గొని తమ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర సాధన కోసం జీవితాలను అంకితం చేసిన ఉద్యమకారులు నేడు ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక కన్వీనర్ మంద బాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమం కేవలం రాజకీయ పోరాటం కాదని, అది కోట్లాది ప్రజల ఆత్మగౌరవ యాత్ర అని అన్నారు. ఆ ఉద్యమంలో తమ కుటుంబాలను, ఉపాధిని, భవిష్యత్తును పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారులు ప్రస్తుతం కనీస జీవన భద్రత లేక ఇబ్బందులు పడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో అనేక మంది యువకులు విద్య, ఉద్యోగాలను పక్కనపెట్టి ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. పోలీసు కేసులు, జైలు జీవితం, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటూ రాష్ట్ర సాధన కోసం కష్టపడ్డ ఉద్యమకారులకు నేడు సరైన గుర్తింపు లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఎంతో మంది ఉద్యమకారులు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యం చేయించుకునే స్తోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉద్యమకారుల పిల్లల భవిష్యత్తు కూడా ఆందోళనకరంగా మారిందని, ఉన్నత చదువులు అందించలేని పరిస్థితిలో కుటుంబాలు జీవిస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రస్తుత ప్రజాపాలనలోనైనా ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రం కోసం పోరాడిన ప్రతి ఉద్యమకారుడికి గౌరవ వేతనం అందించడంతో పాటు ప్రత్యేక హెల్త్ కార్డులు జారీ చేసి ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమకారుల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత విద్యా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలాలు కేటాయించి వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన వారిని కేవలం సభలకే పరిమితం చేయకుండా, వారి జీవితాల్లో వెలుగు నింపేలా సంక్షేమ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో దర్గా శ్రీనివాస్, వాలందాస్ మల్లేష్ గౌడ్, కుమ్మరి వెంకటేష్, చింతల రాజు, అంజనేయులు, డప్పు జీవన్ కుమార్, రామకృష్ణ గౌడ్, ఎండి గరీబ్, వడ్డెర ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# తక్షణం జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి.

- తహసిల్దార్ కు వినతిపత్రం అందజేసిన బిజెపి నాయకులు.

రామాయంపేట, మే 27 (సిరి న్యూస్)



రామాయంపేట మండలంలో తక్షణమే జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ బిజెపి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బుధవారం నాడు స్థానిక తహసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు.రామాయంపేట మండల పరిధిలోని దంతపల్లి, పర్వతాపూర్, కాట్రాల్, కిషన్ తండా, లక్ష్మాపూర్ తదితర గ్రామాలలో మరియు మండలంలో నీ అనేక గ్రామాలలో సుమారు 300 ఎకరాల్లో రైతులు జొన్న పంట సాగు చేశారు. ప్రస్తుతం జొన్న ధాన్యం కోత పూర్తై కల్లాల్లోకి చేరినప్పటికీ, ఇప్పటి వరకు ప్రభుత్వం తరపున కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందన్నారు.ఇప్పటికే అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారనీ ,కల్లాల్లో నిల్వ ఉంచిన జొన్న ధాన్యం తడిసి పాడయ్యే పరిస్థితి నెలకొందనీ ,రైతులు రాత్రింబవళ్లు తమ పంటను కాపాడుకునేందుకు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం అన్నారు. ఒక వైపు పెట్టుబడులు పెరిగి, మరోవైపు పంటకు సరైన ధర మరియు కొనుగోలు సౌకర్యం లేక రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు.ప్రభుత్వ సూచనల మేరకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ప్రభుత్వ చెప్పిన దానికి అనుగుణంగా సాగు చేసిన జొన్న పంటను ఇప్పుడు కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడం అన్యాయం. వెంటనే మండలంలోని సంబంధిత గ్రామాల్లో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని భారతీయ జనతా పార్టీ రామాయంపేట మండల శాఖ డిమాండ్ చేసింది.లేదంటే రైతాంగంతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని ఆ పార్టీ అధికార యంత్రాంగాన్ని హెచ్చరించింది. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఆర్ దిలీప్ కుమార్ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో డిప్యూటీ ఎమ్మార్వో గారికి వినతి పత్రం సమర్పించడం జరిగింది భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు ,అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి దంతపల్లి సర్పంచ్ మస్కూరి బాలరాజు రైలాపూర్ ఉప సర్పంచ్ ప్రశాంత్ అక్కన్నపేట మాజీ సర్పంచ్ సిద్ధ రాములు పట్టణ మాజీ అధ్యక్షుడు భానుచందర్ యు మోర్చా అధ్యక్షులు నాగరాజు ఓబీసీ జిల్లా నాయకులు నవత్ రాజేంద్రప్రసాద్ కె వినయ్ సంతోష్ పట్టణ నాయకులు నితిన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు .

# వరి ధాన్యం కొనుగోలు లో ప్రభుత్వం నిర్లక్ష్యం

- లారీల ద్వారా తరలింపులో నిర్లక్ష్యం దీనికి తోడు అకాల వర్షం తడిసిన ధాన్యం

**కొల్చారం మే 27 ,,(సిరి న్యూస్)**

వరి ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు నరస యాతన అనుభవిస్తున్నారు దీనికి తొడు అకాల వర్షం వల్ల కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యం తడిసి ముద్దయిపోయింది సకాలంలో రైతులకు కోన సంచులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు వచ్చేనెల జూన్ మాసం ఆరంభం అవుతున్న నేపథ్యంలో వర్షం ఆరంభం అవుతుందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు ఇప్పటివరకు ప్రభుత్వం కేవలం 60 శాతం మాత్రమే కొనుగోలు చేపట్టారు రైతులందరూ కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం చేరుకున్న వివిధ సెంటర్ల వద్ద సీరియల్ ప్రకారం కొనుగోలు చేపట్టడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా అధికారులు మేల్కొని తీసుకువచ్చిన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు

# గడ్డపోతారం మున్సిపాలిటీ ప్రగతి బాట

## 15 కోట్లతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**జిన్నారం మే 27 సిరి న్యూస్**

పటాన్ చేరు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడిన ప్రతి మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం గడ్డ పోతారం మున్సిపల్ పరిధిలోని మాదారం, లక్ష్మీపతిగూడెం, వావిలాల, గడ్డ పోతారం, అల్లి నగర్, కిస్టాయపల్లి, ఖాజీపల్లి, జిఎంఆర్ కాలనీలలో 15 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు స్థానిక మున్సిపల్ పాలకవర్గం సభ్యులతో కలిసి శంకుస్థాపన చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. హాజరైన మున్సిపల్ చైర్మన్ సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ వెంకట రామయ్య, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు.

# ఆర్ఆర్-30 రోడ్ పూర్తి చేయాలని

## తెనా వినతి

**రామచంద్రపురం, మే 27, (సిరి న్యూస్):**



దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్ఆర్–30 ఎక్స్‌టెన్షన్ రోడ్ పనులను తక్షణమే పూర్తి చేసి, దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ (తెనా) ప్రతినిధులు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.తెనా అధ్యక్షుడు రమణ ఈశ్వరగారి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ అల్లాడి, ఈసీ సభ్యురాలు దీప్తి రెడ్డి ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం కమిషనర్‌ను కలిసి గోపన్నపల్లి తండా నుంచి కొల్లూరు వరకు ఉన్న రహదారి సమస్యలను వివరించారు.ఆర్ఆర్–30 రోడ్ పనులు పూర్తికాకపోవడంతో తెల్లాపూర్, ఉస్మాన్ నగర్, కొల్లూరు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తేనా తెలిపింది. రహదారిపై గుంతలు, దెబ్బతిన్న భాగాలు, డ్రైనేజీ సమస్యల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొంది. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండడం వల్ల ప్రయాణికులు మరింత ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది.రోడ్డు పక్కనున్న డ్రెయిన్‌లను శుభ్రపరచడం, RR7 స్ట్రెచ్‌పై మీడియన్ నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు చేపట్టాలని ప్రతినిధులు కోరారు.జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ మాట్లాడుతూ రోడ్ పనులకు ఇప్పటికే టెండర్లు పిలిచినట్లు తెలిపారు. రాబోయే రెండు నెలల్లో పెండింగ్ పనులు, మరమ్మతులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# లక్ష రూపాయల ఎల్ఓసి అందజేసిన జీఎంఆర్



**రామచంద్రపురం,(పటాన్చెరు), మే 27, (సిరి న్యూస్):**

తెల్లాపూర్ డివిజన్ ఇందిరానగర్ కాలనీకి చెందిన నోముల నరసింహ గౌడ్ వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన లక్ష రూపాయల విలువైన ఎల్‌ఓసిని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బుధవారం అందజేశారు.పటాన్చెరు లోని తన కార్యాలయంలో కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసిని అందించిన ఎమ్మెల్యే, ఆపత్కాలంలో నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ కౌన్సిలర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# వరికుప్పలను సైతం వదలని అకాల వర్షం





- నష్టం కొల్చారం మండలంలోని
- పలు గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి వరి ధాన్యం
- కొనుగోలుమ కేంద్రాల వద్ద తడిసిన ధాన్యం

**కొల్చారం మే 27 ,(సిరి న్యూస్)**

కొల్చారం మండల పరిధిలో వరిగుంతం పైతర చిన్న ఘనాపూర్ ఎనగండ్ల రాంపూర్ కిష్టాపూర్ కొంగోడు తదితర గ్రామాలలో మంగళవారం నాడు కురిసిన అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలు వర్షపు నీటిలో మునిగిపోవడంతో దిగుబడిపై ప్రభావం పడింది. కోత దశలో ఉన్న పంటలు తడిసి నాణ్యత కోల్పోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సెంటర్ల వద్ద ధాన్యం తడిచి ముద్దయ్యాయి దీంతో రైతన్నలులబోదిబోమంటున్నారు తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారుప్రభావిత గ్రామాల్లో కొల్చారం పరిసర ప్రాంతాలతో పాటు పలు గ్రామాల్లో వ్యవసాయభూముల్లో నీరు నిల్వ ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు అకాల వర్షంతో వరి పంటలకు తీవ్ర నష్టం పొలాల్లో నిలిచిన వర్షపు నీరు అధికారుల పరిశీలనకు రైతుల విజ్ఞప్తి నష్టపరిహారం ఇవ్వాలని రైతుల డిమాండ్

# గీతంలో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీ.ఎడ్. కోర్సు

**రామచంద్రపురం,(పటాన్చెరు), మే 27, (సిరి న్యూస్):**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ (ఐటీఈపీ)ను ప్రారంభించనున్నట్లు స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రిచా శర్మ తెలిపారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)–2020కు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కోర్సులో భాగంగా బి.ఏ. బి.ఎడ్., బి.ఎస్సీ. బి.ఎడ్. నాలుగేళ్ల సమగ్ర డ్యూయల్ డిగ్రీలను అందించనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్ అనంతరం విద్యార్థులకు సబ్జెక్టు పరిజ్ఞానంతో పాటు వృత్తి పరమైన బోధనా శిక్షణను ఒకే కోర్సులో అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు కలిగిన, సామాజిక బాధ్యత గల ఉపాధ్యాయులను తీర్చిదిద్దేందుకు ఈ కోర్సును రూపొందించినట్లు డాక్టర్ రిచా శర్మ తెలిపారు. బాల్యదశ విద్య, ప్రాథమిక అక్షరాస్యత, సమ్మిళిత విద్య, భారతీయ విలువలు, నైతికత, ఆధునిక బోధనా విధానాలకు ఈ పాఠ్య ప్రణాళికలో ప్రాధాన్యత కల్పించినట్లు చెప్పారు.కొత్త విద్యా విధానంలోని 5+3+3+4 నిర్మాణానికి అనుగుణంగా ఫౌండేషనల్, ప్రిపరేటరీ, మిడిల్, సెకండరీ దశలకు అవసరమైన ఉపాధ్యాయులను ఈ కార్యక్రమం ద్వారా సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. సంప్రదాయ విధానంలో ఐదేళ్లు పట్టే ఉపాధ్యాయ విద్యను ఈ సమగ్ర కోర్సుతో నాలుగేళ్లలోనే పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఎన్ఐటీలు, కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు సహా సుమారు 223 విద్యాసంస్థల్లో ఈ కోర్సు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశాలు జాతీయ ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఎన్సిఇటి–2026 ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకే ప్రవేశాలు కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు 9542424259/66 నెంబర్ కు గీతం అధికారిక వెబ్‌సైట్ www.gitam.edu ను సందర్శించాలని సూచించారు.

GITAM
DEEMED TO BE UNIVERSITY

# ధాన్యం తడిసిపోవడంతో రైతుల రాస్తారోకో

**గుమ్మడిదల, మే 27 (సిరి న్యూస్):**





ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు

కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉంచిన వరి ధాన్యం అకాల వర్షానికి తడిసిపోవడంతో ఆగ్రహించిన రైతులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. మున్సిపాలిటీ కేంద్రమైన గుమ్మడిదలలో జాతీయ రహదారి 765డీపై బస్టాండ్ వద్ద రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు లారీలు సమయానికి అందుబాటులోకి రాకపోవడంతో ధాన్యం తరలింపులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఇప్పటికే కొనుగోలు చేయాల్సిన ధాన్యం రోజుల తరబడి కేంద్రాల వద్దే నిల్వ ఉండిపోతుండటంతో అకాల వర్షాలకు తడిసి రైతులకు నష్టం వాటిల్లుతోందన్నారు. అధికారులు వెంటనే స్పందించి లారీల సమస్యను పరిష్కరించి, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, ఉపాధ్యక్షుడు ఆనంద్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ సీహెచ్ కుమార్ గౌడ్, రంగారెడ్డి, యాదారం సంజీవరెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులు రాస్తారోకో చేయడంతో ప్రధాన రహదారిపై వాహనాలు కిలోమీటర్ల నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఎండ వేడికి తట్టుకోలేక చిన్నపిల్లల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. వరి ధాన్యం తడిసిందని రైతులు ఆందోళన చేస్తే బస్సులు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు

# భక్తి, త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పర్వదినం

- భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలకు సిద్ధమైన ముస్లిం సోదరులు

**గుమ్మడిదల, మే 27 (సిరి న్యూస్):**

ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే ప్రధాన పండుగల్లో ఒకటైన బక్రీద్ పర్వదినం గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. ప్రేమ, త్యాగం, భక్తి భావాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను ఈద్–ఉల్–అజ్హా (బక్రీద్)గా ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు ప్రత్యేకంగా జరుపుకుంటారు. ఇస్లాం మత విశ్వాసాల ప్రకారం హజరత్ ఇబ్రహీం అల్లాపై అపారమైన విశ్వాసంతో చేసిన త్యాగానికి గుర్తుగా బక్రీద్ పండుగను నిర్వహిస్తారు. అల్లా ఆదేశాలకు విధేయతగా కుర్బానీ ఇవ్వడం ఈ పండుగలో ముఖ్యాంశంగా నిలుస్తుంది. కుటుంబ సభ్యుల పేరున గొర్రెలు లేదా ఇతర జంతువులను కుర్బానీగా సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. కుర్బానీ చేసిన మాంసాన్ని పేదలకు పంచడం ద్వారా దానధర్మాలకు ప్రాధాన్యం ఇస్తారు. ముస్లింల పవిత్ర పండుగల్లో రంజాన్ అనంతరం అత్యంత ప్రాధాన్యం కలిగిన పర్వదినంగా బక్రీద్ నిలుస్తుంది. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు, దానధర్మాలు ప్రధానంగా ఉంటే, బక్రీద్ పండుగ త్యాగనిరతి, భక్తి భావాలను ప్రతిబింబిస్తుందని మత పెద్దలు పేర్కొంటున్నారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం జిల్‌హజ్ మాసంలో ఈ పండుగను జరుపుకుంటారు. ప్రతి ముస్లిం తన జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలనే సంకల్పంతో ఉంటారని మత పెద్దలు తెలిపారు. హజ్ యాత్ర అనంతరం జరుపుకునే పవిత్ర పర్వదినమే బక్రీద్ అని వివరించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని గుమ్మడిదల మండలంతో పాటు పారిశ్రామికవాడ ప్రాంతాల్లోని మసీదులను సుందరంగా అలంకరించారు. ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పండుగ సందర్భంగా భక్తి పారవశ్యం వెల్లివిరుస్తుండగా, ముస్లిం కుటుంబాల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

# బాల్క సుమన్ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి

**రామచంద్రపురం,(పటాన్చెరు), మే 27, (సిరి న్యూస్):**



మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలపై పోలీసులు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం, సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కొల్కురి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు.బుధవారం పటాన్చెరు పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో వినాయక రెడ్డికి వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇటీవల జరిగిన సమావేశంలో బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు ప్రజల్లో ఆందోళన కలిగించేలా ఉన్నాయని అన్నారు.ఇలాంటి అభ్యంతరకర వ్యాఖ్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని పేర్కొంటూ, భవిష్యత్తులో ఎవరూ ఇటువంటి వ్యాఖ్యలు చేయకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.తెలంగాణలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ప్రజల్లో అలజడి సృష్టించే వ్యాఖ్యలను ఉపేక్షించరాదని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మాజీ పీసీసీ కార్యదర్శి మతిన్, పట్టణ ఉపాధ్యక్షుడు యువరాజ్ మోరే, కార్మిక నాయకులు రాజు, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసీ కళాశాలకు రూ.57.50 కోట్లు మంజూరు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య
- మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన నాయకులు



**జోగిపేట, మే 27, సిరి న్యూస్:**

సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయు వద్ద ఫార్మసీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి రూ.57.50 కోట్లు మంజూరైనట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబులు తెలిపారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ విద్యా, వైద్యం, రోడ్లు వంటి వాటికి వేలాది కోట్ల రూపాయలు అందోలు నియోజకవర్గం మంజూరు చేయిస్తున్నారని వారు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గత పది సంవత్సరాలలో నియోజకవర్గం వెనుకబడిపోయిందని, తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి ప్రత్యేక చొరవతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. వేలాది కోట్ల రూపాయల పనులు నియోజకవర్గంలో చురుకుగా కొనసాగుతున్నాయన్నారు. 150 పడకల ఆసుపత్రి పనులు చురుకుగా సాగుతున్నాయి అన్నారు. గతంలో మన ప్రాంతంలో నుంచి వచ్చిన సిఎస్ఆర్ నిధులను గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల ప్రాంతాలకు తరలించారన్నారు. ప్రస్తుతం మంత్రి కృషితో సంగారెడ్డి జిల్లాకు సిఎస్ఆర్ నిధులు సంపూర్ణంగా ఖర్చు పెడుతూ అభివృద్ధి సంక్షేమం తో ముందుకు వెళ్తున్నారన్నారు. రాష్ట్రంలోనే అందోల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో మొదటి వరుసలో ఉంచాలన్నదే మంత్రి ఉద్దేశమన్నారు. మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం అందోలుకు ఫార్మసీ కళాశాలకు నిధులు మంజూరు చేయించినందుకు మంత్రి దామోదర్ రాజనర్సింహ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ ఎస్. జగన్ మోహన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు శివరాజ్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, కౌన్సిలర్లు పట్లోళ్ల శ్రీనివాస్, కోషికే రాజశేఖర్, తోట్ల రామకష్ణ, గడ్డం అరుణ్ కుమార్, మాజీ కౌన్సిలర్ లు ఎస్. సురేందర్ గౌడ్, ప్రదీప్ గౌడ్, పట్లోళ్ల ప్రవీణ్, ఆల్లె శ్రీకాంత్, పిట్ల లక్ష్మణ్,పి. దుర్గేష్, తుపాకుల సునీల్, కే. నాగరాజు, కో ఆప్షన్ సభ్యులు ప్రవీణ్ కుమార్, జి షాన్,ఆత్మ కమిటీ డైరెక్టర్ చిట్యాల మధు, కాలేదు, నాయకులు జిఆర్. మధుసూదన్ రెడ్డి, డాకూరి శ్రీనివాస్, సైలాన్, అనిల్, భాస్కర్, శ్రీనివాస్, అనిల్ రాజ్, శ్రీశైలం, లక్ష్మీనారాయణ, చోటు ఖాన్, వీరేశం, అశోక్ ఇతరులు పాల్గొన్నారు.



# డ్రైనేజీ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**రామచంద్రాపురం, మే 27, (సిరి న్యూస్):**

రామచంద్రాపురం డివిజన్‌లో నెలల తరబడి కొనసాగుతున్న డ్రైనేజీ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారంలో జలమండలి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.కనుకుంటా బస్తీ, రైతు బజార్ సమీప ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. దీంతో జలమండలి సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించిన పుష్పనగేష్, డ్రైనేజీ నీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దుర్వాసన, దోమల సమస్యతో పాటు అనారోగ్య సమస్యలు కూడా పెరుగుతున్నాయని పేర్కొన్నారు.వెంటనే సమస్యలను పరిష్కరించాలని జలమండలి సిబ్బందిని ఆదేశించిన ఆయన, ఇకపై రెండు రోజుల్లోగా సమస్యలు పరిష్కరించకపోతే జలమండలి మేనేజింగ్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.



# లారీల కొరతతో రోడ్డెక్కిన అన్నదాతలు





- ప్రభుత్వంనికి వ్యతిరేకంగా నినాదాలు
- కొనుగోలు కేంద్రాలలో రోజుల తరబడి దాన్యం నిలువలు
- వర్షా లకు తడిసి ధాన్యం
- తరుగు పేరుతో రైతులకు నష్టం

**చిలిపిచెడ్ మే 27: (సిరి న్యూస్)**

దేశానికి వ్యవసాయం వెన్నెముక లాంటిది ఎద్దు ఏడ్చిన వ్యవసాయం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు అని అంటారు.రైతులు ఎంతో కష్టపడి ఆరుగాలం పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొస్తే కొనుగోలు కేంద్రాలలో లారీలు సరిగ్గా రావడం లేదని బుధవారం చందూరు గ్రామస్తులు రైతులు రోడ్డు ఎక్కారు సంగారెడ్డి –మెదక్ రహదారిపై నిరసన తెలిపారు గ్రామ రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు ఐకెపి, ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దాదాపు నెల రోజులు గడుస్తున్నా ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు పంట పండించిన సమయం కంటే కొనుగోలు సమయమే ఎక్కువగా అవుతుందని రాత్రి కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయిందని కొనుగోలు కేంద్రాల నిర్లక్ష్యం వలన కష్టపడి పండించిన పంటలు వర్షాలతో నీటిపాలు అయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు తడిసిన ధాన్యంను తరగు పేరుతో మిల్లర్లు కొనుగోలు చేయకపోవడంతో క్వింటాలుకు 3 నుండి 4 కిలోలు తరుగు తీయడంతో నష్టం వాటిల్లుతుందని కేంద్రాలలో టార్పలిన్ అందించక సరైన సౌకర్యాలు కూడా లేవని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దు అని చెప్తున్నా అధికారులు మాత్రం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు రైస్ మిల్లుల దగ్గర లారీలు రోజుల తరబడి ఉంటున్నాయి తొందరగా లారీలలో ఉన్న ధాన్యం బస్తాలను కాలి చేయకుండా రైస్ మిల్లర్లు జాప్యం చేస్తున్నారు ఈ జాప్యంతో రైతులకు తరుగుతో నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు పోలీసులు జోక్యంతో ఆందోళన విరమించారు ఈ కార్యక్రమంలో రైతులు వంకం సురేష్,రామ్ రెడ్డి, నరసింహారెడ్డి బాలచందర్ వెంకటేశం దత్తయ్య , సాయిబాబా నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

- వచ్చే అన్ని స్థానాలు సాధించేలా ఇప్పటి నుంచే పునాదులు వేయాలి
- సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి
- ఉమ్మడి మెదక్ జిల్లా నేతలకు హరీశ్‌రావు దిశానిర్దేశం
- జూన్ మొదటి వారంలో నియోజకవర్గ కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు



**సంగారెడ్డి, (సిరిన్యూస్):**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు అధ్యక్షతన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు మరియు సమన్వయకర్తలతో సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హరీశ్ రావు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ.. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా భావించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు విభేదాలు పక్కనబెట్టి పూర్తి సమన్వయంతో క్షేత్రస్థాయికి వెళ్లాలన్నారు. నియోజకవర్గాల వారీగా నియమితులైన సమన్వయకర్తలు స్థానిక నాయకత్వంతో మమేకమై ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని హరీశ్ రావు సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో సమయం కేటాయించాలన్నారు. ఈసారి సాధారణ సభ్యత్వానికి రూ.10, క్రియాశీలక సభ్యత్వానికి రూ.50 రుసుముగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ విడత సభ్యత్వ నమోదు ప్రక్రియను పార్టీ పూర్తిగా డిజిటల్ (ఆన్‌లైన్) విధానంలో చేపడుతోందని.. స్పాట్‌లో లైవ్ ఫోటో తీసుకోవడంతో పాటు ఓటరు వివరాలను కూడా అక్కడే నమోదు చేయడం వల్ల ఈ డ్రైవ్ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా సభ్యత్వాలు నమోదు చేస్తే.. అది రాబోయే స్థానిక సంస్థల, ఇతర ఎన్నికల్లో పార్టీ విజయానికి బలమైన పునాదిగా మారుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో మనం ఇప్పటికే 7 స్థానాలు గెలుచుకున్నామని, రాబోయే రోజుల్లో పదికి పది స్థానాలు సాధించడమే మన లక్ష్యం కావాలన్నారు. జూన్ మొదటి వారంలో సభ్యత్వ నమోదుపై శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు హరీశ్ రావు తెలిపారు. ఆన్‌లైన్ నమోదు విధానంపై నాయకులకు, డిజిటల్ వాలంటీర్లకు పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ మెంబర్‌షిప్ డ్రైవ్ నూరు శాతం విజయవంతం కావడానికి స్థానిక ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కీలక సమావేశంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్ రెడ్డి, మాణిక్ రావు, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్ రెడ్డి, చంటి క్రాంతి కిరణ్, భూపాల్ రెడ్డి, శశిధర్ రెడ్డి, మాజీ చైర్మన్లు ఒంటేరు ప్రతాపరెడ్డి, దేవి ప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్ మరియు మెదక్ జిల్లా మెంబర్షిప్ ఇన్‌చార్జి బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

## బాలయ్యను అభినందించిన ఆదర్శ్ రెడ్డి



**రామచంద్రపురం, మే 27, (సిరి న్యూస్):**

శ్రీలంకలో నిర్వహించిన "మాస్టర్స్ అథ్లెటిక్స్ శ్రీలంక 12వ వార్షిక ఛాంపియన్‌షిప్–2026" పోటీల్లో పలు పతకాలు సాధించిన విద్యుత్‌నగర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ పెద ముత్తని బాలయ్యను పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి అభినందించారు.కొలంబోలోని సుగతదాస స్టేడియంలో జరిగిన పోటీల్లో 70 ప్లస్ పురుషుల విభాగంలో బాలయ్య డిస్కస్ త్రో, జావెలిన్ త్రో విభాగాల్లో రజత పతకాలు, హామర్ త్రోలో కాంస్య పతకం సాధించారు.ఈ సందర్భంగా బాలయ్య బుధవారం ఆదర్శ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి నియోజకవర్గానికి గుర్తింపు తీసుకురావడం ఆనందంగా ఉందని ఆదర్శ్ రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.బాలయ్య విజయంపై స్థానిక ప్రజలు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వర్షం సృష్టించిన భీభత్సం

**ఝరాసంఘం, మే 27(సిరిన్యూస్)**



మంగళవారం రోజు రాత్రి భారీ వర్షం బీభత్సం సృష్టించింది. రోహిణీ కార్తె ప్రారంభ సమయంలో ఈ స్థాయిలో వర్షపాతం నమోదవడం ఇదే మొదటిసారి. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలతో పాటు గంటకు 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, తీవ్రమైన ఉరుములు–మెరుపులతో వర్షం భీభత్సం సృష్టించింది. ఈదురుగాలులా కారణంగా చెట్లు విరిగి రోడ్డు పై పడడంతో రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో పాటు , విద్యుత్ స్తంభాలు విరిగి విద్యుత్ కు అంతరాయం ఏర్పడింది.ఝరాసంగం మండలం ప్యారవరం గ్రామంలో బీహార్ రాష్ట్రా నికి చెందిన తులసి రామ్ అనే వ్యక్తి ఉదయం కాలకృత్యాలు కోసం వెళ్లగా ఒక్కసారిగా వాగు రావడంతో మధ్యలో చిక్కుకుపోయాడు. గమనించిన గ్రామస్తులు నిచ్చెన సహాయంతో వ్యక్తిని కాపాడారు. ఝరాసంగం కేతకి సంగమేశ్వర స్వామి దేవస్థానం వద్ద వాలాద్రి పొంగింది. ఏడాకులపల్లి, జీర్లపల్లి, మేదపల్లి, గంగాపూర్, ఈదులపల్లి, దేవరంపల్లి, బొప్పనపల్లి, ప్యారవరం, బర్దిపూర్, పొట్టి పల్లి వాగులు, చెరువులకు భారీగా నీరు చేరింది. మామిడి రైతులు తీవ్రంగా నష్టం జరిగింది.

## ఐకెపి సీఏ సమ్మెలో భాగంగా తాసిల్దార్ కు మెమొరండం

**కొల్చారం మే 27 ,(సిరి న్యూస్)**



కొల్చారం మండల వ్యాప్తంగా ఐకెపి విఓ ల సమ్మె మంగళవారం 10వ రోజుకు చేరుకున్నాయి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చడంలో విఫలమైందని తమకిస్తున్న కనీస వేతనం గిట్టుబాటు కావడంలేదని మండల కేంద్రమైన శ్రీ శక్తి భవనం ముందు గత పది రోజులుగా సమ్మె కొనసాగుతుంది తమతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తుందని వేతనం పెంచే వరకు సమ్మె కొనసాగుతుందని వివో లు అన్నారు ఈ కార్యక్రమంలో మండల voa ల అధ్యక్షురాలు v మంజుల కార్యదర్శి అశోక్ voa లు నర్సింలు పద్మ నాగరాజ్ యాదగిరి లక్ష్మణ్ స్వరూప సుమలత భారతి శమంతా సంతోషి మిగతా voa లు పాల్గొనడం జరిగిందిమండల voa ల అధ్యక్షురాలు v మంజుల కార్యదర్శి అశోక్ voa లు నర్సింలు పద్మ నాగరాజ్ యాదగిరి లక్ష్మణ్ స్వరూప సుమలత భారతి శమంతా సంతోషి మిగతా voa లు పాల్గొనడం జరిగింది మండల వివోల సంఘం అధ్యక్షురాలు మంజుల కార్యదర్శి అశోక్ పద్మ నాగరాజ్ సంతోషి స్వరూప లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

## అకాల వర్షా లకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

- రైతులు అధైర్య పడొద్దు.. పుకార్లు నమ్మొద్దు
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**నర్సాపూర్ మే 27, (సిరి న్యూస్):**



అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులు పూకార్లను నమ్మి మోసపోవద్దని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ రైతులకు విజ్ఞప్తి చేశారు.బుధవారం నర్సాపూర్ మండలం తుల్జారంపేట్ గ్రామంలోని ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. మంగళవారం రాత్రి పడిన అకాల వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 400 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిందని తడిసిన ధాన్యం ఆరబెట్టి ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు పంపించి రైతులకు న్యాయం చేస్తామన్నారు. సివిల్ సప్లై అధికారులు ఇచ్చిన రిపోర్టు ప్రకారం 250 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లు కు తరలించామన్నారు. మిగతా తడిసిన ధాన్యాన్ని బుధవారం సాయంత్రం కల్లా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తామన్నారు. తడిసిన ధాన్యంను చూసి రైతులు అధైర్య పడద్దని ప్రభుత్వ శాఖలన్నీ ధాన్యం కొనుగోలుపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నాయి అన్నారు. రైతులు ఎవరు పుకార్లను నమ్మి మధ్యవర్తులను ఆశ్రయించద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డిఓ రామకృష్ణ తహసిల్దార్ శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.



# స్పైసీ ఇడ్లీ.. పిల్లలకు తెగ నచ్చేస్తాయి..

ఇడ్లీ.. పిల్లలకు అస్సలు నచ్చని ఆహారంలో టాప్‌లో ఉంటుంది. తినే వాళ్లూ కూడా రోజూ వీటినే పెడితే.. ఎప్పుడూ ఇవే చప్పటి ఇడ్లీలు తినాలా..? అని విసుక్కుంటారు. తినడానికి అయిష్టత ప్రదర్శిస్తారు. అంతేకాకుండా రుచికరంగా ఏమైనా చేసి పెట్టచ్చు కదమ్మా.. అని అడుగుతారు. పిల్లలు ఇలా తరచూ అడుగుతున్నారా? అయితే ఈ స్పైసీ ఇడ్లీ రెసిపీ మీకోసమే. మీరు ఎప్పుడూ చేసే మామూలు ఇడ్లీలతోనే ఇంట్లో వాళ్లకీ నచ్చేలా కొత్తగా ఒక పదార్థాన్ని తయారు చేయచ్చు. ముఖ్యంగా పిల్లలు ఇష్టంగా తినేలా స్పైసీగా, ఈజీగా చేసి పెట్టచ్చు. ఉదయాన్నే ఇడ్లీలు తినడం నచ్చకపోయినా, సాయంత్రానికి ఇడ్లీలు మిగిలిపోయినా ఇలా స్పైసీ తవా ఇడ్లీలను తయారు చేసి పెట్టండి.ఈ రెసిపీ అందరికీ కచ్చితంగా నచ్చుతుంది. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌గా, సాయంత్రం స్నాక్స్‌గా ఉపయోగపడే స్పైసీ తవా ఇడ్లీని ఎలా తయారు చేయాలో చూసేద్దాం రండి..

## కావాల్సినవి..

శనగపప్పు రెండు టేబుల్ స్పూన్లు
మినపపప్పు రెండు టేబుల్ స్పూన్లు
ఎండు కొబ్బరి ముక్కలు రెండు టేబుల్ స్పూన్లు
బియ్యం ఒక టేబుల్ స్పూన్
నువ్వులు ఒక టేబుల్ స్పూన్
మిరియాలు
ఎండు మిర్చీ 5 లేదా 6
పుట్నాలు
చింతపండు
ఇడ్లీలు
బటర్ లేదా నెయ్యి లేదా నూనె రెండు టేబుల్ స్పూన్లు
ఆవాలు 1/2 టీస్పూన్
జీలకర్ర 1/2 టీస్పూన్
కరివేపాకు తాళింపుకు సరిపడా
తరిగిన ఉల్లిపాయ ఒకటి
తరిగిన టమాటా ఒకటి
తరిగిన పచ్చిమిరపకాయలు రెండు
పసుపు 1/2 టీస్పూన్
కారం పొడి 1/2 టీస్పూన్
ఉప్పు రుచికి తగినంత
తరిగిన కొత్తిమీర

## తయారీ విధానం..

ముందుగా మనం రోజూ చేసుకున్నట్లే ఇడ్లీలను చేసి పక్కక్కు పెట్టుకోవాలి.
తరువాత శనగపప్పు, మినపపప్పు,పుట్నాలు ఎండు కొబ్బరి ముక్కలు, బియ్యం, నువ్వులు, ఎండిమిర్చీలు, మిరియాలు అన్నింటినీ ఒకదాని తర్వాత ఒకటి తీసుకుని వేయించాలి.
ఈ మసాలా దినుసులన్నీ చల్లారిన తర్వాత ఒక మిక్సీ జార్ లోకి తీసుకుని దాంట్లో చింతపండు వేసి మెత్తటి పౌడర్ లాగా చేసి పక్కక్కు పెట్టేయండి.
ఇప్పుడు మనం తయారు చేసుకున్న ఇడ్లీలను ముక్కలుగా కట్ చేసుకోవాలి. వీటిని పిల్లలకు నచ్చే విధంగా రకరకాల షేపుల్లో కట్ చేసుకోవచ్చు. ఇలా చేయడం వల్ల పిల్లలు మరింత ఇష్టంగా తింటారు.
తరువాత ఒక ఫ్రైయింగ్ ప్యాన్ తీసకుని దాంట్లో రెండు టేబుల్ స్పూన్ల బటర్ లేదా నెయ్యి వేయాలి. ఇవి రెండూ లేకపోతే నూనె పోయండి.
నూనె వేడెక్కిన తర్వాత దాంట్లో ముక్కలుగా చేసుకున్న ఇడ్లీలను వేసి వేయించాలి. ఇడ్లీలు కాస్త క్రిస్పీగా, రంగు మారేంత వరకూ వేయించి పక్కక్కు పెట్టుకోవాలి.
తరువాత అదే ఫ్రైయింగ్ ప్యాన్లో ఒక టేబుల్ స్పూన్ నూనె లేదా నెయ్యి వేయాలి.
నెయ్యి వేడిక్కిన తర్వాత అందులో జీలకర్ర, ఆవాలు, కరివేపాకు వేసి వేయించాలి.
తరువాత దాంట్లోనే తరిగిన ఉల్లిపాయలు వేయాలి.
ఉల్లిపాయలు గోధుమ రంగులోకి మారేంతవరకూ వేయించుకున్న తర్వాత దాంట్లో పచ్చిమిర్చీ వేసి వేయించాలి.
పచ్చిమిర్చీ కూడా చక్కగా వేగిన తర్వాత దాంట్లో సన్నగా తరిగి పెట్టుకున్న టమాటాలు వేసి వేయించాలి.
టామాటాలను పూర్తిగా వేయించుకున్న తర్వాత దాంట్లో మనం మనం ముందుగా తయారు చేసుకున్న మసాలా పొడి, ఉప్పు వేసి బాగా కలపాలి.
వీటిని పచ్చి వాసన పోయేంత వరకూ వేయించిన తర్వాత ముక్కలుగా చేసి పక్కక్కు పెట్టుకున్న ఇడ్లీలను దీంట్లో వేయాలి.
మనం వేసుకున్న మసాలాలు అన్నీ ఇడ్లీలకు పట్టేంత వరకూ వాటిని ఫ్రై చేయాలి.
ఇడ్డీలు వేగిన తర్వాత రుచి చూసి ఉప్పు కారం తగ్గితే మరింత వేసుకువాలి. మిగిలిపోయిన ఇడ్లీలు అయితే పుల్లగా ఉంటాయి కనుక కాస్త ఎక్కువ మసాలాలు అసవరం అవుతాయని గుర్తుంచుకోండి.
ఇడ్లీలు చక్కగా వేగిన తర్వాత తరిగి పెట్టుకున్న కొత్తిమీరను వేసి స్టవ్ ఆఫ్ చేసేయండి.
అంతే స్పైసీగా ఉండే తవా ఇడ్లీ తయారయినట్లే. వేడి వేడిగా సర్వ్ చేసి తినేయచ్చు. పిల్లలకు బాక్సుల్లోకి కూడా పెట్టేయచ్చు.






# నోరు ఆరోగ్యంగా ఉండాలంటే.. ఇలా చేయండి

నోరు ఆరోగ్యంగా ఉటే మొత్తం ఆరోగ్యం, శ్రేయస్సుకు కృషి చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. పొద్దున్నే లేచి బ్రష్ చేసుకున్న అనంతరం మౌత్‌వాష్‌తో నోరు పుక్కిలిస్తుంటారు. దంతాలు-చిగుళ్ల ఆరోగ్యానికి, నోటి దుర్వాసనను దూరం చేయడానికి ఈ ప్రక్రియ బాగా తోడ్పడుతుందంటున్నారు. నిపుణులు. సాధారణంగా మార్కెట్లో దొరికే మౌత్‌వాష్‌లలో ఉండే రసాయనాల గాఢత నోటి ఆరోగ్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంటుంది. అందుకే మన వంటింట్లోనే దొరికే కొన్ని రకాల నూనెలతో నోటిని పుక్కిలించడం వల్ల నోరు శుభ్రపడడమే కాకుండా ఇతర ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి.




**ఆయిల్ పుల్లింగ్ ప్రక్రియతో ప్రయోజనాలు :**
మన నోటిలో వందల కొద్ది సూక్ష్మక్రిములు ఉంటాయి. అందులో కొన్ని హానికరమైనవి ఉంటాయి. ఆ సూక్ష్మక్రిములు పంటి నొప్పి, చిగుళ్లకు సంబంధించిన వ్యాధులతో పాటుగా నోటి దుర్వాసనకు కారణమవుతాయని నిపుణులు చెబుతున్నారు. అయితే ఆయిల్ పుల్లింగ్ ప్రక్రియ ఇలాంటి బ్యాక్టీరియాను తొలగించగలదని తాజాగా నిర్వహించిన కొన్ని అధ్యయనాల్లో వెల్లడైంది. నోటిని మంచిగా శుభ్రపరచుకోకపోవడంతో నోటి ఇన్ఫెక్షన్లు, చిగుళ్లలో సమస్యల వల్ల నోటి దుర్వాసన రావడం కామన్ అని నిపుణులు చెబుతున్నారు. అయితే, ఈ సమస్య నుంచి బయటపడటానికి మార్కెట్‌లో దొరికే మౌత్‌వాష్‌ల కంటే మన వంటింట్లో లభించే నూనెలే సమర్థంగా పనిచేస్తున్నట్లు మరో పరిశోధనలో వెల్లడైంది.

**ప్రతిరోజూ ఆయిల్ పుల్లింగ్ :** చక్కెరకు సంబంధించిన ఆహార పదార్థాలు అధికంగా తీసుకోవడం, దంతాల మధ్య చిక్కుకున్న పదార్థాల అవశేషాలను తొలగించుకోకపోవడం వల్ల పళ్లు పుచ్చిపోవడం మనం గమనిస్తూనే ఉంటాం. ఇలాంటి సమస్య నుంచి విముక్తి లభించడానికి నిపుణులు సూచించే అద్భుతమైన చిట్కా ఆయిల్ పుల్లింగ్. ప్రతి రోజూ ఉదయాన్నే బ్రష్ చేసుకున్న తర్వాత ఆయిల్ పుల్లింగ్ చేయడం ద్వారా రంధ్రాలకు కారణమయ్యే బ్యాక్టీరియా నశిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కొంతమందిలో చిగుళ్లలో వాపు, రక్తస్రావం లాంటి సమస్యలు తలెత్తుతాయి. అలాంటి వారు ఆయిల్ పుల్లింగ్‌తో ఉపశమనం పొందచ్చంటున్నారు నిపుణులు. దంతాల మీద పేరుకున్న పాచి, పసుపుదనాన్ని తొలగించడంతో పాటుగా పళ్లను మెరిపించడానికి ఈ పద్ధతి చక్కగా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ఆయిల్ పుల్లింగ్ ప్రక్రియ వల్ల దవడ, మెడ కండరాలకు చక్కటి వ్యాయామం అందుతుందంటున్నారు. తద్వారా ఆయా భాగాల్లో ఏదైనా నొప్పి ఉంటే తగ్గిపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఆయిల్ పుల్లింగ్‌కు ఆలివ్, కొబ్బరి, నువ్వుల నూనెలు ఉత్తమ ఎంపిక. వీటిలో ఏదో ఒక దాన్ని ఎంచుకొని టేబుల్‌స్పూన్ నూనెను నోట్లోకి తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.ఆపై ఇరవై నిమిషాల పాటుగా మీరు తీసుకున్న నూనె నోట్లోని అన్ని మూలకు వెళ్లేలా పుక్కిలిస్తూ ఉండాలి. ఈ క్రమంలో దీన్ని మింగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలి. పని పూర్తయ్యాక ఆ నూనెను ఉమ్మివేయాలి.
ఇక ఈ ప్రక్రియ ముగిసిన తరువాత ఏదైనా తినేముందు లేదా తాగే ముందు నోటిని శుభ్రపరచుకోవాలని, ఆ తర్వాతే ఆహారం తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. అలాగే ఆహారం తీసుకున్న తర్వాత సైతం నోటిని శుభ్రపరచుకోవాలని సూచిస్తున్నారు.



# ఒత్తిడిని తగ్గించుకోవచ్చా..

మనస్సు ప్రశాంతంగా ఉండాలంటే ఏం చేయాలి? ఈ ప్రశ్నల గురించి అందరూ ఏదో ఒక సమయంలో ఆలోచిస్తారు. ఆరోగ్యకరమైన ఆహారమే వీటన్నింటికీ సరైన సమాధానమని తాజా సర్వేలో తేలింది.మానసిక ఆరోగ్యం కోసం క్లినికల్ ట్రైల్స్‌కి వచ్చిన డేటా ఆధారంగా కొంత మంది ఈ విషయంపై పరిశోధనలు చేశారు. సంతులిత ఆహారం తీసుకుంటే మానసిక ఆరోగ్యంతో పాటు ఒత్తిడి కూడా నియంత్రించుకోవచ్చని తేలింది. ఈ నివేదిక సైకో మెడిక్ మెడిసిన్‌లో ప్రచురితమైంది. ఆరోగ్యకర డైట్ మనుషుల మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. ఉత్సుకతపై ఎలాంటి ప్రభావం చూపించదు. నిర్ధిష్టమైన డైట్ తీసుకునే వాళ్లకి ఉపయోగపడుతుంది. అనవసరమైన ఆహారం తీసుకోవాల్సిన పనిలేదు. బరువు తగ్గడం, కొవ్వు నియంత్రణ, పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం లాంటి చర్యలతోనూ మానసిక ఆరోగ్యం కుదుటపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్స్‌కి బదులు పీచుపదార్థాలు ఎక్కువగా ఉండే కూరగాయలు తీసుకుంటే ఫలితం త్వరగా వస్తుందని ఫిర్త వెల్లడించారు







## జై భీమ్ డైరెక్టర్‌తో సూర్య నెక్స్ట్ మూవీ!

ప్రస్తుతం బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు అనౌన్స్ చేస్తున్న కోలీవుడ్ స్టార్ సూర్య.. ఇప్పుడు తన 'సూర్య47' కోసం సిద్ధం అవుతున్నాడు. 'ఆవేశం' ఫేమ్ డైరెక్టర్ జీతూ మాధవన్ తెరకెక్కిస్తున్న ఇందులో నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. మాలవుడ్ యగ్ హీరో నస్లెస్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతుండగా.. సూర్య48కు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్డేట్ కోలీవుడ్ ఫిలిమ్ ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. సూర్య తన తదుపరి ప్రాజెక్టు 48కోసం 'జై భీమ్' డైరెక్టర్ టి.జె. జ్ఞానవేల్‌తో మరోసారి చేతులు కలిపినట్లు టాక్. 2021లో వచ్చిన 'జై భీమ్' చిత్రంలో సూర్య ప్రధాన పాత్రలో నటించి.. నిర్మించాడు. తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలై మంచి సక్సెస్‌ను అందుకుంది. ఇప్పుడు ఈ డైరెక్టర్‌తో సూర్య తన తదుపరి చిత్రం 'సూర్య48'ను చేసేందుకు సిద్ధం అయ్యాడట. ఈ సినిమా షూటింగ్ సెప్టెంబర్‌లో ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తుండగా.. 'జగరం స్టూడియోస్' నిర్మించే అవకాశం ఉన్నట్లు టాక్. అంతే కాకుండా.. దీనిపై త్వరలో అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే అవకాశం ఉన్నట్లు కోలీవుడ్ వర్గాల్లో వార్తలు వైరల్ అవుతున్నాయి. దీంతో.. హిట్ కాంబోతో మరో క్లాసిక్ హిట్ లోడింగ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు.

## 'ధురంధర్' ప్రొడక్షన్ డిజైనర్‌పై లైంగిక వేధింపుల కేసు

ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్'. తాజాగా ఈ చిత్రానికి వర్క్ చేసిన ప్రొడక్షన్ డిజైనర్ సైనీ జోహ్రేపై లైంగిక వేధింపుల ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాజెక్టులో అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చండీగఢ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

గతేడాది సెప్టెంబర్ 10న సినిమాకు సంబంధించిన చర్చల కోసం సైనీ తనను చండీగఢ్‌లోని ఒక హోటల్‌కు రావాలని కోరినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడికి వెళ్లాక అసభ్యకరంగా ప్రవర్తించారని ఆమె ఆరోపించారు. తాను అనారోగ్యానికి గురైనప్పటికీ, అక్కడి నుండి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారని తెలిపారు. అంతేకాకుండా ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే కెరీర్ దెబ్బతింటుందని నిందితుడు బెదిరించినట్లు ఆమె ఫిర్యాదులో వివరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# రౌడీ కోసం 'కన్నప్ప' బ్యూటీ

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు రవి కిరణ్ కోలా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్టైనర్ 'రౌడీ జనార్ధన'. దిల్ రాజు నిర్మాణంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఒక క్రేజీ అప్‌డేట్ వైరల్ అవుతోంది. ఈ సినిమాలో ఒక స్పెషల్ మాస్ సాంగ్ కోసం మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అందుకోసం 'కన్నప్ప' చిత్రంతో టాలీవుడ్ దృష్టిని ఆకర్షించిన యంగ్ బ్యూటీ ప్రీతి ముకుందన్ పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే చిత్ర యూనిట్ ఆమెతో సంప్రదింపులు జరిపిందని, దీనికి సంబంధించి మరికొద్ది రోజుల్లోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని వినిపిస్తోంది. ఒకవేళ ఖరారైతే, ఇది క్రేజీ కాంబినేషన్ అనే చెప్పాలి. కాగా, ఈ సినిమా అవుట్‌పుట్ పట్ల చిత్ర బృందం చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నట్లు సమాచారం. ఇప్పటివరకు చిత్రీకరించిన సన్నివేశాలు చాలా అద్భుతంగా వచ్చాయని, విజయ్ దేవరకొండ మేనరిజమ్స్, రవి కిరణ్ మార్క్ టేకింగ్ ఈ సినిమాను మరో లెవల్‌కు తీసుకెళ్తాయని మేకర్స్ నమ్ముతున్నారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద పక్కా బ్లాక్ బస్టర్ అవుతుందని టీమ్ గట్టి ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ సరసన కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తోంది. యాంగ్రీ మ్యాన్ రాజశేఖర్ ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. మరి రౌడీ జనర్ధాన ఎలా ఉంటుందో చూడాలి.





### క్రేజీ మల్టీస్టారర్ కోసం అనిల్ రావిపూడి బిగ్ స్కెచ్..


# మ్యూజిక్ డైరెక్టర్‌గా ఆ కోలీవుడ్ స్టార్!

టాలీవుడ్ హిట్ మిషన్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తన 10వ సినిమా ప్రకటనతోనే ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు క్రియేట్ చేశారు. మన శంకరవరప్రసాద్ గారు వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత, ఆయన తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ను విక్టరీ వెంకటేష్ - నందమూరి కల్యాణ్ రామ్ కలయికలో ఒక క్రేజీ మల్టీస్టారర్‌గా ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఫస్టాఫ్ స్క్రిప్ట్ లాక్ అవ్వగా, ప్రస్తుతం సెకండాఫ్ పనులపై అనిల్ అండ్ టీమ్ కసరత్తులు చేస్తున్నారు. అన్ని కుదిరితే జులై లేదా ఆగస్టు నెలల్లో ఈ క్రేజీ మల్టీస్టారర్ పట్టాలెక్కే అవకాశం ఉందని సమాచారం.

అనిల్ రావిపూడి తన సినిమాల కథల స్వభావాన్ని బట్టి ఎప్పటికప్పుడు మ్యూజిక్ డైరెక్టర్స్‌ను మారుస్తుంటారు. ఈసారి తన సరికొత్త స్క్రిప్ట్‌కు అద్భుతమైన స్వరాలు అవసరమని భావించి, కోలీవుడ్ స్టార్ కంపోజర్ జి.వి. ప్రకాష్ కుమార్‌ను రంగంలోకి దించారు. ఈ సినిమా కథ, కథనాలు ట్రెండీగా ఉంటూనే, అనిల్ రావిపూడి మార్క్ ఫన్ అండ్ ఎమోషన్స్‌తో సరికొత్త హంగులతో ఉండబోతోందని ఇండస్ట్రీ వర్గాల టాక్. ఈ మల్టీస్టారర్ చిత్రంలో కాస్టింగ్ మరింత కలర్‌ఫుల్‌గా ఉండబోతోందని తెలుస్తుంది. విక్టరీ వెంకటేష్ జోడీగా కీర్తి సురేష్ నటిస్తుండగా, కల్యాణ్ రామ్ పక్కన కృతి శెట్టి సందడి చేయనుంది. భారీ తారాగణంతో తెరకెక్కబోతున్న ఈ సినిమాను వచ్చే సంక్రాంతి (2027) పండుగ కానుకగా రిలీజ్ చేయడమే లక్ష్యంగా చిత్రబృందం ప్లాన్ చేస్తోంది.

## ఒక్క పోస్టర్‌తో కథ చెప్పేశారు.. పెద్ది స్టోరీ ఇదేనా?

అసలు పెద్ది కథేంటి? అది తెలియాలంటే జూన్ 4న సినిమా విడుదలయ్యే వరకు వెయిట్ చేయాల్సిందే. కానీ ముందు నుంచి దర్శకుడు బుచ్చిబాబు పెద్ది కథ పై ఒక హింట్ ఇస్తు వస్తున్నాడు. నిజానికి ఈ సినిమా మల్టీస్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కింది. క్రికెట్, కుస్తీ, రన్నింగ్ లాంటి ఆటలు సినిమాలో కీలకంగా ఉండనున్నాయి. రామ్ చరణ్ ఆట కూలీగా కనిపించనున్నాడు. దీంతో.. ఇది మల్టీస్పోర్ట్స్ యాక్షన్ డ్రామా అని అంతా ఫిక్స్ అయిపోయారు. అలాగే.. ఊరికోసం పెద్ది చేసే పోరాటమే అసలు కథ అని టాక్ ఉంది. అయితే పెద్ది కోర్ పాయింట్ మాత్రం వేరే ఉందని లేటెస్ట్ పోస్టర్‌తో మరోసారి సాలిడ్ హింట్ ఇచ్చేశాడు బుచ్చి.




సరిగ్గా గమనిస్తే.. మొదటి నుంచి పెద్ది ప్రమోషనల్ కంటెంట్‌లో రైల్వే ట్రాక్‌ను హైలెట్ చేస్తు వస్తున్నారు. చికిరి సాంగ్‌లో, ట్రైలర్‌లోను ఇది క్లియర్‌గా కనిపిస్తుంది. ఇప్పుడు రిలీజ్ చేసిన పోస్టర్ అయితే.. రైల్వే ట్రాక్‌ను మరింత హైలెట్ చేస్తు ఉంది. ట్రాక్‌తో పాటు బ్లడ్ బాత్ అనేలా ఉన్నాడు రామ్ చరణ్. ఈ లెక్కన చూస్తే.. పెద్ది కథను సింపుల్‌గా ఒక లైన్‌లో చెప్పెయొచ్చు. తన ఊరికి రైల్వే ట్రాక్‌ను తీసుకురావడమే పెద్ది లక్ష్యంగా కనిపిస్తోంది. దానికోసం పెద్ది ఆడిన ఆటలు, పోరాటం సినిమాకే హైలెట్‌గా ఉండనున్నాయి. అలాగే ఎమోషనల్ పరంగా సినిమా పీక్స్‌లో ఉంటుందని ముఖ్యంగా రామ్ చరణ్ పర్ఫార్మెన్స్‌తో పెద్ది క్లైమాక్స్ సినిమాకు ప్రాణం పోసేలా ఉంటుందని చిత్ర యూనిట్ చెబుతోంది. మొత్తంగా పెద్దిగాడు తన ఊరికోసం ఆడబోయే ఆట ఫ్యాన్స్‌కు గూస్‌బంప్స్ ఇస్తుందని అంటున్నారు. మరి సినిమా ఎలా ఉంటుందో చూడాలి.


## అనుకోకుండా వచ్చింది.. జీవితాన్నే మార్చేసింది..

సెకండ్స్ ఇన్నింగ్స్‌లో వైవిధ్యమైన పాత్రలు ఎంచుకుంటూ వరుస సినిమాలు చేస్తున్న నటుడు సునీల్.. తాజాగా తన సినిమా 'కాటాలన్' ప్రమోషన్స్‌లో పాల్గొని 'పుష్ప'లో పాత్రపై ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. అల్లు అర్జున్ 'పుష్ప' సినిమాలో మంగళం శ్రీను పాత్రలో కనిపించిన సునీల్ తన యాక్టింగ్‌తో ఫుల్ పాపులారిటీ దక్కించుకున్నాడు. ఈ సక్సెస్‌పై సునీల్ మాట్లాడుతూ.. 'సుకుమార్ నుంచి నాకు వచ్చిన సర్‌ప్రైజింగ్ పాత్ర 'పుష్ప'లో మంగళం శ్రీను. ఈ సినిమా తర్వాత నా జీవితం ఊహించని విధంగా మారిపోయింది. దీంతో ఇతర ఇండస్ట్రీ దర్శకులు కూడా నన్ను సరికొత్త కోణంలో చూడటం స్టార్ట్ చేశారు. ఈ బ్రేక్‌తో 'జైలర్'లో ఆఫర్ వచ్చింది. ఇప్పుడు తమిళ సినిమా కాటాలన్‌లో 'మారి' అనే పవర్ ఫుల్ పాత్ర వచ్చింది. చాలా కాలం తర్వాత, నాకు ఎంతో సంతృప్తినిచ్చే ఒక పాత్ర లభించింది. ఇప్పుడు, వివిధ భాషల నుండి నాకు వైవిధ్యభరితమైన పాత్రలు వస్తున్నాయి. ప్రస్తుతం ఒక నటుడిగా, నా ఈ ప్రయాణాన్ని నేను పూర్తిగా ఆస్వాదిస్తున్నాను' అంటూ చెప్పుకొచ్చాడు.



### పనిలేని వెదవల గురించి

## నేను మాట్లాడను..



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రం జూన్ 4 ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. దీంతో ప్రమోషన్స్‌లో జోరు పెంచిన చిత్ర బృందం వరుస ఇంటర్వ్యూస్ ఇస్తూ సందడి చేస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా ఇంటర్వ్యూలో పాల్గొన్న జగపతి బాబు తన పాత్రపై, అలాగే చరణ్‌పై వస్తున్న ట్రోల్స్‌పై స్పందించారు. 'పెద్ది' చిత్రంలో జగపతిబాబు 'అప్పలసూరి' అనే పవర్ ఫుల్ పాత్రలో కనింపించబోతున్నాడు. ఇది జగపతిబాబుకు రామ్ చరణ్‌తో రెండో సినిమా. మొదట రంగస్థలంలో విలన్‌గా నటించి మెప్పించి.. ఇప్పుడు పెద్దితో మరోసారి తన నెగిటివ్ షేడ్ చూపించేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఈ క్రమంలోనే తన పాత్రపై మాట్లాడుతూ.. 'లెజెండ్ తర్వాత నేను దాదాపు 100 సినిమాలు చేశానని అనుకుంటున్నాను. కానీ నాకు కేవలం 5-6 పాత్రలు మాత్రమే గుర్తుండిపోయాయి. వాటిలో పెద్ది సినిమాలోని అప్పలసూరి పాత్ర ఒకటి. సినిమా విడుదలయ్యాక, కచ్చితంగా ఆ పాత్రే అగ్రస్థానాన్ని దక్కించుకోవచ్చు' అంటూ ధీమా వ్యక్తం చేశాడు.

ఇక చరణ్‌పై వస్తున్న ట్రోల్స్‌పై మాట్లాడుతూ.. 'పనిలేని వెదవలు గురించి నేను ఎక్కువ మాట్లాడను. ట్రోలింగ్ చేసేవాళ్ళు గుంటకాడ నక్కల్లాంటి వాళ్ళు. వాళ్లకు పనిలేక ఎవర్ని కిందకు లాగుదామా అని ఎదురు చూస్తారు. అసలు చరణ్ ఈ సినిమాకు ఎంతో కష్టపడ్డాడు.. ఎన్నో గాయాలు అయ్యాయి, ఎంత ఎఫర్ట్ పెట్టాడు, ఎంత కష్టపడ్డాడు ఇవన్నీ వదిలేసి ఏదో దొరికితే దాన్ని పట్టుకుంటారు. అసలు ఈవెంట్లో అన్నివేల మంది జనాలు, ఓ పక్క డబ్బింగ్, పోస్ట్ ప్రొడక్షన్, సెన్సార్‌కు సంబంధించి హీరోకు కాల్స్ వస్తున్నాయి. అలాగే మరో పక్క థియేటర్స్ ఇష్యూ నడుస్తుంది. ఇవన్నీ హీరో తలపై ఉంటాయి. అవన్నీ మోస్తూ ఇంత హడావిడిలో కొన్ని విషయాలు మర్చిపోవడం సహజం. నేను కూడా మర్చిపోతాను. అంత ప్రెజర్‌లో అలాంటివి జరుగుతాయి. దీన్ని కూడా ట్రోల్స్ చేస్తారా... ఆ ట్రోలింగ్ చేసేవాళ్ళు నాలుగు రోజులు మాట్లాడతారు పోతారు. దీనివల్ల చరణ్‌కి ఏం కాదు' అని చెప్పుకొచ్చాడు. 'నన్ను కూడా ఏదో సీన్‌కి 70, 80 టేక్స్ తీసుకున్నా అని ట్రోల్ చేశారు. అసలు అది అబద్దం. నేను మహా అయితే మూడు టేక్స్ తీసుకున్నా ఏమో హైయెస్ట్. దాన్ని కూడా ఫేక్ న్యూస్‌తో ట్రోలింగ్ చేశారు. పని లేకుండా ఇదే పనిగా వాళ్లు ఏదోఒకటి చేస్తూనే ఉంటారు' అని చెప్పుకొచ్చారు.

## చాలా నీచంగా కామెంట్స్ చేస్తున్నారు..

ఒకప్పటి హీరోయిన్ నమిత స్టార్ హీరోలతో నటించి బాక్సాఫీసును షేక్ చేసింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో స్టార్ హీరోలతో నటించి మెప్పించింది. ఇక తెలుగులో 'సొంతం' సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఆమె ప్రభాస్, బాలకృష్ణ వంటి స్టార్స్ స్క్రీన్ షేర్ చేసుకునే అదృష్టాన్ని పొందింది. అయినప్పటికీ కెరీర్ పీక్స్‌లో ఉండగానే సినిమాలకు గుడ్ బై చెప్పేసింది. ఇక నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను పంచుకుంటోంది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నమిత ఎమోషనల్ కామెంట్స్ చేసింది. నమిత మాట్లాడుతూ.. "ఇన్‌స్టాగ్రామ్‌లో కొందరు నెటిజన్లు చేసిన కామెంట్లు చాలా దారుణంగా ఉన్నాయి. 'నీ అమ్మ క్యాన్సర్‌తో చనిపోవాలి', 'నీ పిల్లలు, నువ్వు పెంచుకునే జంతువులు కూడా చనిపోవాలి' అంటూ శాపనార్థాలు పెట్టారు. ఆ వ్యాఖ్యలు నన్ను మానసికంగా చాలా దెబ్బతీశాయి.

జీవితంలో మొదటిసారి అలాంటి ఘోరమైన మాటలు చదివినప్పుడు తట్టుకోలేక చాలా రోజులు ఏడ్చాను" అని ఎమోషనల్ అయ్యింది. బిగ్‌బాస్ షో గురించి స్పందిస్తూ.. "హౌస్‌లో జరిగే చిన్న చిన్న విషయాలను జనాలు చాలా ఓవర్‌గా జడ్జ్ చేస్తున్నారు. టీవీలో కనిపించే కేవలం ఒకటిన్నర గంటల ఎపిసోడ్‌ను చూసి, మా 24 గంటల రియాలిటీని, వ్యక్తిత్వాన్ని డిసైడ్ చేయడం అస్సలు సరికాదు. వేరొకరిపై నెగెటివ్ కామెంట్స్ చేసే ముందు, ఒక్కసారి వారి స్థానంలో నిలబడి ఆలోచించండి. నా వరకు నేను ఎలాంటి ట్రోల్స్ అయినా భరిస్తాను కానీ, నా ఫ్యామిలీ, నా పిల్లలు, నా స్నేహితుల జోలికి వస్తే మాత్రం నేను అస్సలు ఊరుకోను" అంటూ నమిత గట్టి వార్నింగ్ ఇచ్చారు. సోషల్ మీడియా వేదికగా సెలబ్రిటీలపై జరుగుతున్న సైబర్ దాడి గురించి నమిత చేసిన ఈ సంచలన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.